



# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 178 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ శనివారం 21 మార్చి 2026 పేజీలు : 12 వెల : 2/-


గ్యాస్ సిలిండర్ కోసం ఎవరూ

## ఆందోళన చెందవద్దు

మంత్రి నాదెండ్ల మనోహర్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్యాస్ సిలిండర్ కోసం ఎవరూ ఆందోళన చెందవద్దని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో నిత్యం సమీక్ష చేస్తున్నామన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సోషల్ మీడియా ప్రచారాలు భయాందోళన కలిగిస్తున్నాయన్నారు. "గ్యాస్ సిలిండర్ల సరఫరాలో లోపం రాకుండా చూస్తున్నాం. ప్రజల్లో అవగాహన పెరిగి క్రమంగా బుకింగ్‌లు తగ్గుతున్నాయి. భయంతోనే ముందుగా ఎక్కువ బుకింగ్స్ జరిగాయి. ఈ నెల 26న ఓ నౌక విశాఖ వస్తుంది. దాంతో చాలా సమస్య తీరుతుంది. గ్యాస్ పరిస్థితిపై సీఎం ఎప్పటి కప్పుడు సమీక్ష చేస్తున్నారు. మంత్రుల బృందానికి తగిన సూచనలు చేస్తున్నారు. ప్రత్యామ్నాయ మిగతా .. 2లో..

రెండు రోజుల్లో పంట నష్టంపై

# పూర్తి నివేదిక సమర్పించండి

- ఎల్పీజీ సిలిండర్ల సరఫరాకు అంతరాయం రానివ్వొద్దు
- అకాల వర్షాలు, గ్యాస్ సరఫరాపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్
- ఇప్పటివరకు పంట నష్టాన్ని రూ.63 కోట్లుగా లెక్కించిన అధికారులు



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** భారీ గాలులు, అకాల వర్షాలు, వడగళ్లతో రాష్ట్రంలో సంభవించిన పంట నష్టంపై రెండు రోజుల్లో పూర్తి స్థాయి అంచనాలు రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. దీనిపై శుక్రవారం క్యాంప్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 12 జిల్లాల్లోని 42 మండలాల్లో 4,840 హెక్టార్లలో మొక్కజొన్న, 1,534 హెక్టార్లలో వరి, 310 హెక్టార్లలో మినుము పంటలకు నష్టం వాటిల్లిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వీటి విలువ రూ.40 కోట్లుగా లెక్కగట్టారు. అలాగే 9 జిల్లాల్లోని 48 మండలాల్లో 1,301 హెక్టార్లలో ఉద్యాన పంటలపైనా వర్షాలు ప్రభావం చూపాయన్నారు. అరటి, బొప్పాయి, మిరప, కూరగాయలు, మామిడి, ఆరెంజ్, నిమ్మ పంటలు దెబ్బతినగా... నష్టం విలువ రూ.23 కోట్లుగా అంచనా వేశారు. ఇప్పటివరకు వేసిన అంచనాల ప్రకారం అన్ని పంటలకు కలిపి మొత్తం నష్టం రూ.63 కోట్లుగా అధికారులు లెక్క తేల్చారు. మరోవైపు ఎల్పీజీ సరఫరాపైనా సీఎం సమీక్షించారు. ఇరాన్ - ఇజ్రాయిల్, అమెరికా మధ్య మరి కొన్నాళ్లు యుద్ధం కొనసాగితే... ఎల్పీజీ గ్లోబల్ సప్లయ్ చైన్ దెబ్బతినే మిగతా .. 2లో..

రాష్ట్రపతి చేతుల మీదుగా

## 'ఆంకాలజీ బ్లాక్' ప్రారంభం

ఆరోగ్యవంతులే స్వయం సమృద్ధి భారత్‌కు పునాది : ద్రౌపది ముర్ము
ఆధునిక సైన్స్, మానవత్వాల కలయికే రామకృష్ణ మిషన్ సేవలు
బృందావనం సేవాశ్రమంలో క్యాన్సర్ రోగులకు మెరుగైన చికిత్స




**బృందావనం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉత్తరప్రదేశ్‌లోని బృందావనంలో గల రామకృష్ణ మిషన్ సేవాశ్రమంలో నూతనంగా నిర్మించిన 'నంద్ కిషోర్ సోమాలి ఆంకాలజీ బ్లాక్'ను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె ప్రసంగిస్తూ, దేశాభివృద్ధిలో ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. ఆరోగ్యవంతమైన పౌరులు ఉన్నప్పుడే బలమైన మరియు స్వయం సమృద్ధి కలిగిన భారతదేశం సాధ్యమవుతుందని ఆమె ఆకాంక్షించారు. దేశ ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందడం అభివృద్ధిలో కీలక భాగమని రాష్ట్రపతి ఈ సందర్భంగా గుర్తుచేశారు. రామకృష్ణ మిషన్ సంస్థ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలపై రాష్ట్రపతి ముర్ము ప్రశంసలు కురిపించారు. ఆధునిక విజ్ఞాన శాస్త్రం మరియు మానవ కరుణ రెండూ కలిస్తే మానవాళి సంక్షేమం కోసం అద్భుతమైన విజయాలను సాధించవచ్చని రామకృష్ణ మిషన్ నిరూపించిందని ఆమె కొనియాడారు. కేవలం చికిత్స అందించడమే కాకుండా, రోగుల పట్ల సానుభూతితో వ్యవహరిం చడం ఈ సంస్థ యొక్క గొప్పతనమని ఆమె అభివర్ణించారు. శాస్త్ర సాంకేతి కతను మానవతా దృక్పథంతో జోడించి నప్పుడే సమాజంలో నిజమైన మార్పు వస్తుందని ఆమె స్పష్టం చేశారు. ఈ నూతన ఆంకాలజీ (క్యాన్సర్) విభాగం మిగతా .. 2లో..

మెడికల్ సీట్ల భర్తీ

## వ్యవహారం


సుప్రీం కోర్టుకు యాజమాన్యాలు



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న మెడికల్ సీట్ల భర్తీ వ్యవహారంపై వైద్య విద్య కళాశాలల యాజమాన్యాలు సుప్రీం కోర్టును ఆశ్రయించాయి. ఫిబ్రవరి 28తో కౌన్సెలింగ్ ముగిసిందని, అప్పటికి ఏపీలో 246, తెలంగాణలో 377 పీజీ సీట్లు భర్తీ కాలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లాయి. వీటిలో ఏపీలో సుమారు 45 కన్వీనర్ కోటా సీట్లు కూడా ఉన్నాయని జస్టిస్ పీఎస్ నర్సింహా, జస్టిస్ అలోక్ అరాథే ధర్మాసనం దృష్టికి యాజమాన్యాల తరఫు న్యాయవాదులు తీసుకొచ్చారు. కాలేజీల్లో చేరేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని, కానీ, గడువు ముగియడంతో కౌన్సెలింగ్ మిగతా .. 2లో..

## పంచాంగ శ్రవణం సాక్షిగా అబద్ధాలు

హామీలు నిలబెట్టలేని ప్రభుత్వం
ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి : వైసీపీ నాయకురాలు రోజా



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు పంచాంగ శ్రవణం సాక్షిగా ప్రజలకు అబద్ధాలు చెప్పారని మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఆర్కే రోజా తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని సీఎం చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా తప్పుపట్టారు. వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయని, ప్రజలు అనేక సమస్యలతో బాధపడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని రోజా మండిపడ్డారు. 18 ఏళ్లు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ. 1,500 ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఈ హామీలు కేవలం ఓట్లు సాధించేందుకు మాత్రమే ఇచ్చినవా అని ఆమె నిలదీశారు. మహిళల ఆర్థిక స్థితి మెరుగుపరుస్తామని చెప్పి మాట తప్పారని ఆరోపించారు. రైతుల సమస్యల విషయంలో కూడా ప్రభుత్వం విఫలమైందని రోజా విమర్శించారు. ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వడంలో నిర్లక్ష్యం చూపిందని, గతంలో జగనన్న పాలనలో రైతులు, పేదలు సంతోషంగా ఉన్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పంట నష్టాలు మిగతా .. 2లో..

## గోదావరిలో విషాదం



స్నానానికి వెళ్లి ఐదుగురు విద్యార్థులు గల్లంతు - భద్రాచలం సమీపంలో దుర్ఘటన
ఇంజనీరింగ్ విద్యార్థులుగా గుర్తింపు - గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి

**భద్రాచలం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోదావరి నదిలో స్నానానికి దిగిన అమరావతి విద్యాసంస్థకు చెందిన విద్యార్థులు గల్లంతైన ఘటన విషాదాన్ని మిగిల్చింది. భద్రాచలం సమీపంలోని వేలేరు వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మొత్తం ఏడుగురు నదిలోకి దిగగా, అందులో ఐదుగురు కనిపించకుండా పోవడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. సమాచారం మేరకు, సరదాగా స్నానానికి దిగిన ఈ విద్యార్థులు ఒక్కసారిగా నదీ ప్రవాహంలో మిగతా .. 2లో..

నాటో దేశాలపై

## ట్రంప్ చిందులు..

పిరికివాళ్లంటూ ఎద్దేవా



**వాషింగ్టన్, విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాటో సభ్యదేశాల వ్యవహారశైలిపై అసహనం వ్యక్తంచేశారు. హర్మూజ్ జలసంధిని తెరిపించేందుకు కలిసి రావాలన్న ఆయన విజ్ఞప్తిని పట్టించుకోకపోవడంపై ఆయన చిర్రుబుర్రలాడారు. పిరికివాళ్లంటూ ఎద్దేవా చేశారు. ఈ సందర్భాన్ని గుర్తు పెట్టుకుంటాని హెచ్చరిస్తూ మిగతా .. 2లో..

ఇప్పటికైనా చెల్లికి జగన్

## న్యాయం చేస్తాడని ఆశిస్తున్నా

వైఎస్ఆర్ సతీమణి విజయమ్మ



**కడప, విశ్వం వాయిస్ న్యూస్ :** కుటుంబ ఆస్తుల పంపకాలపై నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో వివాదం కొనసాగుతున్న వేళ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ సతీమణి విజయమ్మ మీడియాకు అడ్వకేట్ నోటరీ విడుదల చేశారు. వైకాపా నేతలు చేస్తున్న ఆరోపణలపై అందులో పూర్తిస్థాయి స్పష్టత ఇచ్చారు. ఆస్తుల విషయంలో చెల్లెలు, ఆమె పిల్లలకు జగన్ అన్యాయం చేశారని అన్నారు. ఆస్తుల పంపకం ఎప్పుడూ జరగలేదని, వైఎస్ మరణించే వరకు ఉన్న మిగతా .. 2లో..

## ఒత్తిళ్లకు తలొగ్గం..

అమెరికా విజ్ఞప్తికి శ్రీలంక 'నో'



**కొలంబో, విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో అగ్రరాజ్యం అమెరికా చేసిన ఓ విజ్ఞప్తిని శ్రీలంక తిరస్కరించింది. మార్చి నెల ఆరంభంలో రెండు యుద్ధ విమానాలను మట్టాలా అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండింగ్ కోసం అమెరికా అనుమతి కోరగా.. అందుకు నిరాకరించింది. ఈ విషయాన్ని శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే పార్లమెంటులో వెల్లడించారు. ఎర్ర సముద్రం, ఏడెన్ గల్ఫ్ మధ్య ఓ కీలక సముద్ర మార్గంగా ఉన్న జిబౌటీ స్థావరంలోని అమెరికా యుద్ధ విమానాల నుంచి రెండుసార్లు అభ్యర్థనలు వచ్చాయన్నారు. ఈ స్థావరం నుంచి మార్చి 4, 8 తేదీల్లో పలు నౌకా విధ్వంసక మిసైల్స్‌తో కూడిన యుద్ధ విమానాల ల్యాండింగ్ కోసం అడిగితే.. తాము వద్దని చెప్పామన్నారు. అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కొనసాగుతోన్న మిగతా .. 2లో..




# రాయవరంలో 'గ్యాస్' మంట

- ఎండలో పడిగాపులు..
- అదనపు వసూళ్ల బాదుడు!
- బుకింగ్ చేసినా అందని సిలిండర్లు
- 45 రోజుల నిరీక్షణ తప్పదా?
- డెలివరీ బాయ్స్ 'అదనపు' దందా
- అల్లాడుతున్న సామాన్యుడు..

**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వాలు గ్యాస్ సరఫరాలో లోటు లేదని ఘంటాపథంగా చెబుతున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. రాయవరం మండలంలో గ్యాస్ సిలిండర్ కోసం సామాన్యుడు చుక్కలు చూడాల్సి వస్తోంది. ఏజెన్సీల వద్ద కిలోమీటర్ల మేర క్యూలైన్లు, గంటల తరబడి ఎండలో వేచి చూస్తున్న వృద్ధులు, మహిళల దృశ్యాలు ఇక్కడి గ్యాస్ కష్టాలకు అద్దం పడుతున్నాయి.

**బుకింగ్ చేస్తే వారం.. అయినా రాని ఓటిపి!**

వినియోగదారులు గ్యాస్ బుక్ చేసుకున్న వారం రోజులైనా సెల్‌ఫోన్‌కు ఓటిపి (వన్ టైం పాస్వర్డ్) రాకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏజెన్సీలకు వెళ్తే స్టాక్ లేదని సాకులు చెప్పడం, మరోవైపు గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో వేలాది కుటుంబాల్లో పొయ్యి వెలగని పరిస్థితి నెలకొంది. నిబంధనల ప్రకారం 25 రోజుల వ్యవధి ఉండాలి కానీ, నిర్వాహకులు మాత్రం కొత్త బుకింగ్‌కు 45 రోజులు పడుతుందని చెప్పడం వినియోగదారులను విస్మయానికి గురిచేస్తోంది.

**'గోరుచుట్టుపై రోకలిపోటు'.. అదనపు వసూళ్లు!**

ఇప్పటికే ఆకాశాన్నంటిన గ్యాస్ ధరలతో సతమతమవుతున్న సామాన్యుడిపై డెలివరీ బాయ్స్ రూపంలో మరో భారం మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# పూర్తి నివేదిక సమర్పించండి

అవకాశం ఉందని, ఆ సంక్షోభాన్ని ఎదుర్కొనేలా రాష్ట్రంలో సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉందని సీఎం అధికారులకు సూచించారు. ఎక్కడా ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల సరఫరాకు అంతరాయం రానివ్వకుండా చూడాలన్నారు. గ్రామీణ - గిరిజన ప్రాంతాలు, విద్యాసంస్థలు, ఆలయాలు, అన్న క్యాంటీన్లు, అంగన్వాడీలకు గ్యాస్ డెలివరీలో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇండక్షన్ స్టవ్‌లు, పీఎన్జీ వంటి ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఎరువులు, పెట్రోల్, డీజిల్‌కు లోటు రానివ్వకుండా కేంద్రంతో సంప్రదింపులు జరపాలని అధికారులకు సీఎం స్పష్టం చేశారు.

# రాయవరంలో 'గ్యాస్' మంట

పడుతోంది. సిలిండర్ ఇంటికి తెచ్చినందుకు నిర్ణీత ఛార్జీల కంటే అదనంగా భారీ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులు ఇవ్వని పక్షంలో సిలిండర్లు ఇవ్వమని తెగేసి చెప్పడం, ఏజెన్సీ వద్దకు వచ్చి తీసుకోమంటూ ఇబ్బందులకు గురిచేయడం గమనార్హం.

**లోపాయికారి ఒప్పందాలు.. బ్లాక్ మార్కెట్ దందా?**

ఒకవైపు సామాన్యులకు సిలిండర్లు అందక అల్లాడుతుంటే, మరోవైపు కొంతమంది కిరాణా షాపులు, హోటళ్లకు బ్లాక్‌లో సిలిండర్లు విక్రయిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఏజెన్సీలు కావాలనే కృత్రిమ కొరత సృష్టిస్తున్నారా? అన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే ఈ అరాచకాలు సాగుతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రజల డిమాండ్: "బుకింగ్ చేసిన వెంటనే సిలిండర్ అందేలా చూడాలి. అదనపు వసూళ్లపై ఉక్కుపాదం మోపాలి. అధికారులు వెంటనే స్పందించి రాయవరం మండలంలో గ్యాస్ సరఫరా వ్యవస్థ పై అధికారులు వెంటనే దృష్టి సారించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

**రాష్ట్రపతి చేతుల మీదుగా**

# 'ఆంకాలజీ బ్లాక్' ప్రారంభం

అందుబాటులోకి రావడం వల్ల ఉత్తరప్రదేశ్ మరియు పరిసర ప్రాంతాల్లోని క్యాన్సర్ రోగులకు మెరుగైన చికిత్స అందుతుందని రాష్ట్రపతి విశ్వాసం వ్యక్తం చేశారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల నివారణలో అత్యాధునిక మౌలిక సదుపాయాల అవసరం ఎంతో ఉందని, ఈ కొత్త బ్లాక్ ఆ లోటును తీరుస్తుందని ఆమె పేర్కొన్నారు. నిరుపేదలకు కూడా చేరువయ్యేలా రామకృష్ణ మిషన్ అందిస్తున్న ఈ సేవలు ఎందరికో ప్రాణదానంగా మారుతాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను రాష్ట్రపతి ఈ సందర్భంగా ప్రస్తావించారు. మారుమూల ప్రాంతాల్లో కూడా వైద్య సదుపాయాలు మెరుగుపరచడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించగలమని ఆమె చెప్పారు. రామకృష్ణ మిషన్ వంటి సేవా సంస్థలు ప్రభుత్వానికి అండగా నిలుస్తూ సామాజిక బాధ్యతను నెరవేర్చడం అభినందనీయమని అన్నారు. స్వామి వివేకానంద బోధించిన సేవ మార్గంలో నడుస్తూ, ఈ సంస్థ మానవాళికి నిరంతర సేవలు అందించడం గర్వకారణమని ముర్ము పేర్కొన్నారు. ముగింపులో, రాష్ట్రపతి బృందావనం యొక్క పవిత్రతను మరియు ఆధ్యాత్మికతను స్మరించుకున్నారు. ఈ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంలో అట్టడుగు వర్గాలకు వైద్య సేవలు అందించడం భగవంతుడికి చేసే సేవతో సమానమని ఆమె అన్నారు. సేవాశ్రమం నిర్వాహకులకు మరియు వైద్య బృందానికి ఆమె శుభాకాంక్షలు తెలుపుతూ, ఈ నూతన విభాగం అనేక మంది బాధితుల జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పలువురు ప్రముఖులు మరియు రామకృష్ణ మిషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

**గ్యాస్ సిలిండర్ కోసం ఎవరూ**

# ఆందోళన చెందవద్దు

ఇంధనాలపై ప్రజల్లో చైతన్యం తెస్తున్నారు. గ్యాస్ కొరతపై కేంద్రం దృష్టి పెట్టింది. పదేళ్ల క్రితమే రాష్ట్రాన్ని కిరోసిన్ ఫ్రీ స్టేట్‌గా ప్రకటించారు. కానీ, తాజా పరిస్థితుల నేపథ్యంలో వచ్చేవారం రాష్ట్రానికి 2,800 కిలో లీటర్ల కిరోసిన్ వస్తుంది. గిరిజన ప్రాంతాల్లో కుటుంబానికి లీటర్ కిరోసిన్ ఇవ్వాలని భావిస్తున్నాం." అని నాదెండ్ల మనోహర్ తెలిపారు.

# మెడికల్ సీట్ల భర్తీ వ్యవహారం

ముగించారని కోర్టుకు వివరించారు. గడువు పెంచాలని ఫిబ్రవరి 28కి ముందే.. జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)కి సంబంధిత యూనివర్సిటీలు, కాలేజీలు విజ్ఞప్తి చేయగా.. ఎలాంటి సమాధానం రాలేదని కోర్టుకు న్యాయవాదులు వివరించారు. ఇదే పరిస్థితి తలెత్తితే.. కర్ణాటక, మహారాష్ట్రల్లో గడువు పెంచారని చెబుతూ.. సంబంధిత ఉత్తర్వులను కోర్టు ముందుంచారు. వైద్య విద్య కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్‌పై సమాధానం చెప్పాలని ఎన్ఎంసీకి ఆదేశిస్తూ.. తదుపరి విచారణను సర్వోన్నత న్యాయస్థానం మార్చి 23(సోమవారం)కి వాయిదా వేసింది.

# ఒత్తిళ్లకు తలొగ్గం..

యుద్ధం వేళ వస్తోన్న ఒత్తిళ్ల నడుమ శ్రీలంక తటస్థ వైఖరిని కొనసాగించేందుకు కట్టుబడి ఉందని దిసనాయకే స్పష్టం చేశారు. ఎన్ని ఒత్తిళ్లు ఉన్నా సరే తాము తటస్థ వైఖరినే కొనసాగించాలనుకుంటున్నామన్నారు. ఈ యుద్ధం సవాళ్లను విసురుతోందన్న ఆయన.. ఒత్తిళ్లకు శ్రీలంక తలొగ్గదని, తటస్థంగా ఉండేందుకు సాధ్యమైనదంతా చేస్తామని తెలిపారు.

# పంచాంగ శ్రవణం సాక్షిగా అబద్ధాలు

ఎదుర్కొంటున్నారని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యలు రైతులకు ఉపశమనం కలిగించలేకపోతున్నాయని అన్నారు. యువతకు ఇచ్చిన హామీల విషయంలో కూడా ప్రభుత్వం మాట తప్పిందని రోజా ఆరోపించారు. నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి అమలు చేయలేదని, దీంతో యువత నిరాశలో మునిగిపోయిందని చెప్పారు. రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోవడంతో పాటు, రైతులు, యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వ్యాఖ్యలపై కూడా రోజా తీవ్రంగా స్పందించారు. ఆ పదవి తనకు అవసరం లేదని, తనకు ఇతర వ్యాపారాలు ఉన్నాయని చెప్పడం బాధ్యతారాహిత్యంగా ఉందని విమర్శించారు. అర్హత లేని వారికి పదవులు ఇస్తే ఇలాంటి పరిస్థితులు వస్తాయని పేర్కొన్నారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్నారని ఆరోపిస్తూ, బీఆర్ నాయుడు తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# గోదావరిలో విషాదం

చిక్కుకున్నట్లు తెలుస్తోంది. వారిలో కొందరు బయటపడగలిగినా, ఐదుగురు మాత్రం గల్లంతయ్యారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు, విపత్తు నిర్వహణ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు ప్రారంభించారు. గల్లంతైన వారు విద్యాసంస్థలో రెండో సంవత్సరం చదువుతున్న వారిగా గుర్తించారు. గోకతేజ, నవదీప్ (ఉయ్యూరు), పాశం సతీష్ కుమార్ (మదనపల్లి), చారుగుండ్ల శ్రీకర్, పొడిచేటి అభిరామ్ (భద్రాచలం) ఈ ప్రమాదంలో గల్లంతైన వారిగా తెలిపారు. ఈ ఘటనతో వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. నదిలో ప్రవాహం వేగంగా ఉండటంతో గాలింపు చర్యలు కష్టతరంగా మారుతున్నాయి. అయినప్పటికీ అధికారులు పడవలు, లోతు నీటిలో శోధన చేసే బృందాలతో నిరంతరం గాలిస్తున్నారు. స్థానికులు కూడా సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. గల్లంతైన విద్యార్థులను సురక్షితంగా కనుగొనాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు. ఈ ఘటనతో నదుల్లో స్నానం చేసే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం మరోసారి స్పష్టమైంది. ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా యువత నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**నాటో దేశాలపై**

# ట్రంప్ చిందులు..

ట్రూత్ సోషల్‌లో ఆయన శుక్రవారం ఓ పోస్ట్ పెట్టారు. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా జరిపిన దాడి నేపథ్యంలో చమురు రవాణాకు జీవనాడి నాటి లాంటి హర్మూజ్ జలసంధి వద్ద ఇరాన్ అవాంతరాలు సృష్టిస్తోంది. దీంతో అంతర్జాతీయంగా చమురు ధరలు భగ్గుమన్నాయి. కొన్ని దేశాలు చమురు, గ్యాస్ కొరతను ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో హర్మూజ్‌ను తిరిగి తెరిపించేందుకు కలిసి రావాలని డొనాల్డ్ ట్రంప్.. నాటో దేశాలకు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఏ దేశమూ ముందుకు రాకపోవడం ట్రంప్‌నకు కోపం తెప్పించింది. "అమెరికా లేకపోతే నాటో కేవలం ఒక పేపర్ టైగర్ మాత్రమే. అణ్వాయుధ శక్తిగా మారుతున్న ఇరాన్‌ను అడ్డుకునే పోరాటంలో పాల్గొనడానికి అప్పుడు సుముఖత చూపలేదు. కానీ, ఇప్పుడు అధిక ధర చెల్లించాల్సి వస్తుండడంతో చమురు ధరల గురించి ఫిర్యాదు చేస్తున్నారు. దీనికి కారణమైన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిపించేందుకు అవసరమైన సైనిక చర్యకు మాత్రం ముందుకు రావడం లేదు. పిరికివాళ్లు. గుర్తు పెట్టుకుంటా!" అంటూ డొనాల్డ్ ట్రంప్ పోస్ట్ చేశారు.

**ఇప్పటికైనా చెల్లికి జగన్**

# న్యాయం చేస్తాడని ఆశిస్తున్నా

ఆస్తులన్నీ కుటుంబ ఆస్తులేనని ఆమె అన్నారు. "తన ఆస్తులన్నీ నలుగురు మనవలు, మనవరాళ్లకు సమానంగా పంచాలని వైఎస్ఆర్ ఉద్దేశం. ఇది ఆయన ఆదేశం కూడా. దగ్గర వాళ్లందరికీ తెలిసిన వాస్తవమిది. ఎంవోయూలో షర్మిలకు రాసిన ప్రతి ఆస్తి న్యాయంగా ఆమెకు దక్కాల్సిందే. షర్మిల హక్కుకు అనుగుణంగానే జగన్ ఎంవోయూ రాశాడు. వాస్తవానికి షర్మిలకు చెందాల్సిన దానికంటే తక్కువే రాశాడు. సరస్వతి సిమెంట్ సహా యెలహంక భూమి కూడా షర్మిలదే. షర్మిలకు ఇప్పటి వరకు ఇచ్చానని చెబుతున్న డబ్బంతా డివిడెండ్ మాత్రమే. ఆస్తుల విషయంలో జగన్ తన మేనల్లుడు, మేనకోడలికి ఇప్పటివరకు అన్యాయం చేశాడు. ఇప్పటికైనా న్యాయం చేస్తాడని తల్లిగా ఆశిస్తున్నాను. నిజం ఏమిటో దేవుడికి, నా కొడుక్కి కూడా తెలుసు. దేవుడి సాక్షిగా నేను రాసినవన్నీ వాస్తవాలు మాత్రమే" అని ఆమె పేర్కొన్నారు.

# ఎల్పీజీ గ్యాస్ కొరతపై కట్టడి చర్యలు

**ఏజెన్సీలకు జేసీ నిశాంతి కఠిన ఆదేశాలు**



**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

ప్రస్తుత ఎల్పీజీ వంట గ్యాస్ కొరత నేపథ్యంలో గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు ప్రభుత్వ ఆదేశాలను తప్పకుండా పాటిస్తూ గృహ వినియోగదారులకు సరఫరాలో ఎలాంటి ఫిర్యాదులకు ఆస్కారం లేకుండా పూర్తిగా సహకరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి ఆదేశించారు. శుక్రవారం స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి సమీపంలోని శ్రీ రాజేశ్వరి హెచ్‌పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏజెన్సీలోని స్టాక్, డెలివరీ రికార్డులను పరిశీలించి డీలర్లకు సక్రమ సరఫరాపై పలు సూచనలు జారీ చేశారు. గత 25 రోజులుగా గ్యాస్ బుకింగ్, డెలివరీ ప్రక్రియలను రికార్డుల ఆధారంగా తనిఖీ చేశారు. పట్టణాల్లో 25 రోజులు, గ్రామాల్లో 30 రోజుల వ్యవధిలో సిలిండర్ల సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని, కృత్రిమ కొరతకు ఆస్కారం లేకుండా చూడాలని ఆదేశించారు. బుకింగ్ ప్రక్రియకు అనుగుణంగా మాత్రమే గృహ వినియోగదారులకు గ్యాస్ అందించాలని తెలిపారు. అంతర్జాతీయంగా ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో జిల్లాలో గ్యాస్ కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గృహ వినియోగదారులకు గ్యాస్ డెలివరీలో ఆలస్యం జరగకూడదని స్పష్టం చేశారు. అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టి లేదా బ్లాక్ మార్కెట్‌కు తరలింపు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారదర్శకతతో బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు ప్రాధాన్యత క్రమంలో సిలిండర్లను పంపిణీ చేయాలని సూచించారు. పంపిణీ ప్రక్రియను పౌర సరఫరాల అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. గ్యాస్ లభ్యతపై వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తగినంత నిల్వలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గ్యాస్ సిలిండర్లు కేవలం గృహ వినియోగదారులకు మాత్రమే సమయానికి అందించాలనీ, వాణిజ్య వినియోగానికి గృహ సిలిండర్లను మళ్లించడం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. ఏజెన్సీలు పారదర్శకంగా పనిచేసి వినియోగదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి ఏవైనా అక్రమాలు గమనించిన వెంటనే అధికారులకు తెలియజేయాలని కోరారు. కేంద్రం ఎసెన్షియల్ కమాడిటీస్ చట్టం అమలు చేసి గృహ వినియోగదారులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించిందని తెలిపారు. పానిక్ బుకింగ్‌ను నివారించి ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకోవాలని, మానిటరింగ్ కమిటీల ద్వారా బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహాయ పౌరసరఫరాల అధికారి శరత్, తహసీల్దార్ దివాకర్, సివిల్ సప్లైస్ డీటీ భారతి, తూనికలు కొలతల నియంత్రణ అధికారి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# హరిశ్చంద్రపురం రైల్వే హాల్ట్ ప్రారంభం

**టెక్కలి ప్రజలకు కొత్త సౌకర్యం - కేంద్ర, రాష్ట్ర సమన్వయంతో రైల్వే సేవల విస్తరణ**

**విద్యార్థులు, ఉద్యోగులకు ప్రయాణ సౌలభ్యం - గ్రామీణాభివృద్ధికి కీలక అడుగు**



**శ్రీకాకుళం, విశ్వం వాయిస్ న్యూస్:** శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గ పరిధిలోని కోటబొమ్మాళి మండలంలో హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్‌లో విశాఖపట్నం-గుణపూర్ పాసింజర్ రైలుకు హాల్ట్ సౌకర్యాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కేంద్ర మంత్రితో కలిసి జెండా ఊపి రైలునుప్రారంభించారు. ఈ కొత్త హాల్ట్ ద్వారా ప్రాంతీయ ప్రజలకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడనున్నాయి. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో రైల్వే హాల్టులు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. టెక్కలి నియోజకవర్గ ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఈ సౌకర్యం ఇప్పుడు అందుబాటులోకి రావడం ఆనందకరమని అన్నారు. కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయ కృషి ఫలితంగా ఈ ప్రాజెక్టు సాకారం అయిందని వివరించారు. ఈ రైల్వే హాల్ట్ వల్ల ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులకు ప్రయాణ సౌలభ్యం పెరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చిన ప్రజలకు ఇప్పుడు సమీపంలోనే రైలు సౌకర్యం లభించడం ద్వారా సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతాయని పేర్కొన్నారు. స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు కూడా ఇది ఊతమివ్వనుందని చెప్పారు. రైల్వే సేవల విస్తరణతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతం అవుతుందని అచ్చెన్నాయుడు అభిప్రాయపడ్డారు. రవాణా సౌకర్యాలు మెరుగుపడితే విద్య, ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ హాల్ట్ ప్రాంతీయ ప్రజలకు ఎంతో ఉపయోగపడే మౌలిక వసతిగా నిలుస్తుందని అన్నారు. జిల్లా ప్రజలకు మెరుగైన రైల్వే సౌకర్యాలు కల్పించేందుకు సహకరించిన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సహకారాన్ని కూడా ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకువచ్చేందుకు కృషి కొనసాగిస్తామని తెలిపారు.

**గోదావరిలో విద్యార్థుల గల్లంతుపై**

# సీఎం చంద్రబాబు ఆరా

**ఘటనపై అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి**

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం రేవు వద్ద గోదావరిలో విద్యార్థుల గల్లంతుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీశారు. ఘటనపై అధికారులతో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. స్నానం చేసేందుకు ఏడుగురు విద్యార్థులు గోదావరిలోకి దిగారని, వారిలో ఐదుగురు గల్లంతయ్యారని అధికారులు వివరించారు. గల్లంతైన వారిలో అభిరామ్, శ్రీకర్, నవదీప్ అనే విద్యార్థులు ముగ్గురు మృతి చెందారని, మిగిలి ఇద్దరు విద్యార్థులైన సతీష్ కుమార్, తేజ ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని సీఎం దృష్టికి తీసుకొచ్చారు. దీపక్, హర్ష ప్రాణాలతో బయటపడ్డారని వివరించారు. విద్యార్థులంతా అమరావతిలోని ఓ ప్రైవేట్ యూనివర్సిటీకి చెందిన వారని తెలిపారు. ఆచూకీ లభ్యం కాని ఇద్దరు విద్యార్థుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని సీఎం ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని సీఎం భరోసా ఇచ్చారు.

# 'తృణమూల్' మ్యానిఫెస్టో విడుదల.. దీదీ 10 హామీలు ఇవే..

**విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల కోలాహలం కొనసాగుతోంది. అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల విమర్శలు, ప్రతి విమర్శలతో అక్కడి రాజకీయాలు మరింత హీటు పుట్టిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ (మీఘ్ఘు దీఘఅవతీయవవ) శుక్రవారం ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల చేశారు. బెంగాల్ ఓటర్లను ఆకర్షించి మరోసారి అధికార పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా సీఎం మమతా బెనర్జీ 10 కీలక హామీలు ప్రకటించారు. మరోసారి తమ పార్టీని గెలిపిస్తే రాబోయే ఐదేళ్లలో ప్రతి ఇంట్లో ఆనందం నింపాలనే ఆశయంతో పనిచేస్తామన్నారు. మహిళలు, నిరుద్యోగులకు ఆర్థిక సాయం.. 7 కొత్త జిల్లాల ఏర్పాటు 'ఈసారి తిరిగి అధికారంలోకి వస్తే.. ప్రతి నెలా మహిళలకు ఇస్తున్న ఆర్థిక సాయం రూ.500 పెంచుతాం. అంటే జనరల్ కేటగిరీ మహిళలకు రూ.1500, ఎస్సీ/ఎస్టీ మహిళలకు రూ.1700 చొప్పున అందజేస్తాం. నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.1500 సాయం అందిస్తాం. ఇంటి వద్దే నాణ్యమైన వైద్య సేవలు అందించేలా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలోని వేలాది పాఠశాలలను ఆధునికీకరిచడంతో పాటు ఈ-లెర్నింగ్ సదుపాయాలు కల్పిస్తాం. కొత్తగా ఏడు జిల్లాలు, మున్సిపాల్టీలను ఏర్పాటు చేసి పాలనను ప్రజలకు మరింత చేరువ చేస్తాం. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూ.30వేల కోట్లతో ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశ పెడతాం. ప్రతి కుటుంబానికీ శాశ్వత ఇంటి నిర్మాణం చేపట్టడంతో పాటు ప్రతి ఇంటికీ శుద్ధి చేసిన తాగునీటి సరఫరా అందేలా చూస్తాం. ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్, ఓడరేవు సౌకర్యాలు, వాణిజ్య మౌలిక సదుపాయాలు, అత్యాధునిక గ్లోబల్ ట్రేడ్ సెటర్‌ను అభివృద్ధి చేయడం ద్వారా బెంగాల్‌ను పెట్టుబడులు, వ్యాపారాలకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతాం. వయో వృద్ధులందరికీ నిరంతరాయంగా వృద్ధాప్య పింఛను అందించడంతో పాటు అర్హులైన వారిని ఈ పథకం కిందకు తీసుకొచ్చి క్రమంగా విస్తరిస్తాం" అని మమతా బెనర్జీ హామీ ఇచ్చారు.

**అన్ని మతాలూ నాకు సమానమే: దీదీ**

పశ్చిమ బెంగాల్ ఎన్నికల అనంతరం ఎన్ఆర్సీ, జనగణన పేరుతో ప్రజల పౌరసత్వాన్ని తొలగించేందుకు కేంద్రం ప్రణాళికలు రచిస్తోందని మమతా బెనర్జీ అన్నారు. మ్యానిఫెస్టో విడుదల చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో భాజపా గెలుపునకు సహకరించేలా కేంద్రం, ఈసీ నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణకు ప్లాన్ చేస్తున్నాయన్నారు. ఈ ఎన్నికల్లో ఓడిపోతామని భాజపాకు తెలుసు గనకే రాష్ట్రంలో 'అనధికార రాష్ట్రపతి పాలన' విధించారని ఆరోపించారు. రాష్ట్రాన్ని కాపాడేందుకు భాజపాకు వ్యతిరేకంగా ఐక్య పోరాటం చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. భయపెట్టినా, డబ్బులు ఇచ్చి ప్రలోభ పెట్టినా అప్రమత్తంగా ఉండాలన్నారు. తాను విభజన రాజకీయాలు చేయడంలేదని, అన్ని మతాల ప్రజలూ తనకు సమానమేనని తెలిపారు. బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

## ఎడిటర్ వాయిస్

# జైలుకు జేజేలు.. వారి నుంచి వీరి దాకా!

జైలుకి వెళ్ళి బెయిల్ మీద బయటకు వచ్చిన నేతలకు జనాలు నీరాజనాలు పట్టే సీన్ టీవీ తెర మీద కానీ మొబైల్ ఫోన్లలో కానీ చూసిన వారికి అదొక తమాషాగా అనిపిస్తుంది. జైలుకు వెళ్ళిన నేతలు తాము అమాయకులమని చెబుతారు. అన్యాయంగా కేసులు పెట్టారని అంటారు. ఇక వారికి జైలు దారి చూపించిన పార్టీలు కానీ నేతలు కానీ తప్పు చేస్తేనే అలా జరిగింది అంటారు. ఇలా ఎవరి వాదనలు వారికి ఉంటాయి. అలాగే ఎవరి అభిమానులు వారికి ఉంటారు, ఒక్క విషయం ఏంటి అంటే జైలుకు వెళ్ళని నేతల కంటే వెళ్ళిన నేతలకే జేజేలు ఎక్కువ. లేకపోతే ఒక్కసారి లెక్క చూసుకోండి ఇటీవల కాలంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు కానీ లేటెస్ట్ గా పల్నాడుకు చెందిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కానీ జైలు నుంచి బయటకు రాగానే అనుచరుల ఆనందం కానీ ఊరేగింపులు కానీ చూసిన వారికి ఆసక్తికరంగా ఆశ్చర్యకరంగా అనిపిస్తుంది.

**ఇంతకు ఇంత బదులు :** ఇక ఏపీలో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక 21 నెలలలో వైసీపీ నేతలు చాలా మంది అరెస్టు అయ్యారు. లేటెస్ట్ గా నెల్లూరు జైలు నుంచి బయటకు వచ్చిన వారు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి. ఆయనను ఎత్తుకుని మరీ అభిమానులు ఊరేగించారు. గజమాల మెడలో వేసి మరీ నినాదాలు చేశారు మీడియా ముందు మాట్లాడిన పిన్నెల్లి అయితే తమకూ ఒక రోజు వస్తుందని అధికార కూటమిని హెచ్చరించారు. తాము ఇంతకు ఇంత బదులు తీర్చుకుంటామని అన్నారు అదే సమయంలో 99 రోజుల పాటు తనను జైలు పాలు చేస్తారా అని ఆయన మండిపడ్డారు. జంట హత్య కేసుతో తనకు సంబంధం లేదని అయినా ఇరికించారని ఆయన ఫైర్ అయ్యారు.

**లిస్ట్ తీస్తే వీరంతా :** అదే విధంగా చూస్తే వైసీపీ నుంచి అరెస్ట్ అయి రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి బయటకు వచ్చిన అంబటి రాంబాబు అక్కడే ప్రెస్ మీట్ ఏర్పాటు చేసి మరీ కూటమి మీద గట్టిగానే ఆగ్రహించారు. తామూ చట్ట ప్రకారం తప్పు చేసిన వారి మీద చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అరెస్ట్ చేశారు, జైలుకు వెళ్ళాం, బయటకు వచ్చాం ఇంతకంటే ఏమి చేస్తారని అంబటి బిగ్ సౌండ్ చేశారు. ఇక వైసీపీ నుంచి చూస్తే మాజీ మంత్రులు జోగి రమేష్, కాకాణి గోవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, ఎంపీ మిధున్ రెడ్డి, మాజీ ఎంపీ నందిగం సురేష్ ఇలా చాలా మంది జైలుకు వెళ్ళి బయటకు వచ్చారు. వచ్చిన వారు అంతా తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రత్యర్థులను లోపలికి పంపిస్తామని గట్టిగా ప్రతిని పూనుతున్నారు.

**నయా ట్రెండ్ గా :** ఇక పదినేహేళ్ళ క్రితం చూస్తే జైలుకు రాజకీయ నేతలు వెళ్లడం అరుదుగా ఉండేది. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ప్రతిపక్షాలను టార్గెట్ చేసేది అంతగా ఉండేది కాదు, ఆ మాటకు వస్తే ప్రతిపక్షం కూడా నిర్మాణాత్మక విమర్శలు చేసేది, ఎక్కడా వ్యక్తిత్వ హననం ఉండేది కాదు, అలాగే టార్గెట్ కూడా పర్సనల్ గా అసలు ఉండేది కాదు, అందుకే ఇచ్చి పుచ్చుకునే ధోరణిలోనే రాజకీయం సాగింది. ఇక ఎపుడైతే ఉమ్మడి ఏపీలో వైసీపీ అధినేత జగన్ కాంగ్రెస్ ని ధిక్కరించి బయటకు వచ్చారో ఆయన అరెస్టుతో ఈ ట్రెండ్ స్టార్ట్ అయింది అని గుర్తు చేస్తున్నారు. ఆ విధంగా అప్పట్లో ఆ అరెస్ట్ అతి పెద్ద రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తే తరువాత కాలంలో అంటే 2019లో వైసీపీ వచ్చాక టీడీపీ నేతల అరెస్టులు వరసబెట్టి సాగాయి. అందులో మాజీ మంత్రులు అచ్చెన్నాయుడు కొల్లు రవీంద్ర వంటి వారు ఉన్నారు. ఆఖరుకు అన్నట్లుగా చంద్రబాబుని ఏకంగా 53 రోజుల పాటు జైలులో ఉంచేలా కథ సాగింది.

**ఇమేజ్ పెరుగుతోందా :** ఇక్కడ మరో విషయం కూడా ఉంది. జైలు నుంచి వచ్చిన వారి మీద ఫోకస్ ఎక్కువగా ఉంటోంది. అంతే కాదు వారు ఎన్నికల్లో రాజకీయాల్లో మరింతగా రాణిస్తున్నారు. గెలుస్తున్నారు కూడా. ఎందుకో తెలియదు కానీ జైలుకు వెళ్ళి వచ్చారు అన్న సింపతీ వర్కౌట్ అవుతోంది అని అంటున్నారు. జైలుకు వెళ్ళి వచ్చిన జగన్ కానీ రేవంత్ రెడ్డి కానీ చంద్రబాబు కానీ ముఖ్యమంత్రులు అయ్యారు. ఇక మాజీ మంత్రులు కానీ కీలక నేతలు కానీ తరువాత ఎన్నికల్లో గెలిచారు. ఒక విధంగా సానుభూతి సెంటిమెంట్ బాగా పనిచేస్తోంది అంటున్నారు.

**బెడిసికొట్టే ప్రమాదం ఉంది :** అయితే ఇదే బాగుందని అనుకుంటూ ముందుకు పోతే చివరికి ఆ సెంటిమెంట్ కూడా బెడిసికొట్టే ప్రమాదం ఉంది ఇక వారు ఏదో చేశారని వీరు చేయడం కాకుండా ఎక్కడో



ఫుల్ స్టాప్ పెట్టాల్సి ఉంది. తెలంగాణాలో సీఎం రేవంత్ రెడ్డి తాను జైలుకు వెళ్ళి వచ్చాను కాబట్టి బీఆర్ఎస్ అగ్ర నేతలను జైలు పాలు చేయలేదు అన్నది గుర్తు చేసుకోవాలి. రాజకీయాలు అంటే ఉన్నతమైనవి ప్రజలకోసం అన్నట్లుగా వాతావరణం మార్చాలి. నిర్మాణాత్మకమైన పాత్ర అధికార పక్షంలో ఉన్నా విపక్షంలో ఉన్నా పోషించాలి. అపుడే జైలూ బెయిలూ జేజేలూ అన్న ఎపిసోడ్లకు చెక్ పడుతుంది.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్

## క్రైం వాయిస్

# విద్యార్థిని ఆత్మహత్యాయత్నం..

### ట్యాంకు ఎక్కి కాపాడిన సబ్‌కలెక్టర్



**మహ్మద్‌నగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఫోన్ ఎక్కువగా చూడొద్దని తల్లిదండ్రులు మందలించినందుకు.. ఓ విద్యార్థిని నీటిట్యాంకు ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరించింది. ఎంతమంది నచ్చజెప్పినా వినలేదు. విషయం తెలుసుకున్న కామారెడ్డి జిల్లా బాన్సువాడ సబ్‌కలెక్టర్ తక్షణమే గ్రామానికి చేరుకున్నారు. తనే స్వయంగా 60 అడుగుల ట్యాంకుపైకి ఎక్కి, విద్యార్థినికి కౌన్సెలింగ్ చేసి, కిందికి తీసుకొచ్చారు. దీంతో తొమ్మిదిన్నర గంటలపాటు కొనసాగిన ఉత్కంఠకు తెరపడింది. పోలీసులు తెలిపిన ప్రకారం... మహ్మద్‌నగర్ మండలం బూర్గుల్ గ్రామానికి చెందిన స్రవంతి అనే విద్యార్థిని ఇందల్వాయి గురుకులంలో ఇంటర్ చదువుతూ ఇటీవల ప్రథమ సంవత్సరం పరీక్షలు రాసింది. ప్రస్తుతం ఇంట్లో ఉంటున్న ఆమె తరచూ ఫోన్ చూస్తుండటంతో తల్లిదండ్రులు బుధవారం రాత్రి మందలించారు. మనస్తాపం చెందిన స్రవంతి చనిపోతానంటూ.. గురువారం ఉదయం 11 గంటల సమయంలో ఇంటికి సమీపంలోని నీటి ట్యాంకు మెట్లను సగం వరకు ఎక్కింది. తల్లిదండ్రులు, సర్పంచి ఆమెను సముదాయించినా వినకపోవడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులను చూసి భయంతో స్రవంతి ట్యాంకును పూర్తిగా ఎక్కి.. దూకుతానంటూ బెదిరించింది. రాత్రి 8 గంటల సమయంలో సబ్‌కలెక్టర్ కిరణ్మయి బాన్సువాడ నుంచి బూర్గుల్‌కు వచ్చారు. బాలికతో మాట్లాడుతూనే.. నెమ్మదిగా తనే మెట్లు ఎక్కుతూ పైకి చేరుకున్నారు. తల్లిదండ్రులు ఏమీ అనకుండా భరోసాగా ఉంటానంటూ స్రవంతికి భరోసా ఇచ్చి.. ట్యాంకు నుంచి కిందికి దించారు.

# డ్రగ్స్ పెడ్లర్ అభిషేక్‌సింగ్ కోసం వేట

### నాలుగు బృందాలతో గాలింపు – ఫాంహౌస్ పార్టీ కేసులో కొనసాగుతున్న దర్యాప్తు
### నిందితుల మధ్య ఆర్థిక లావాదేవీలపైనా సిట్ ఆరా



**మొయినాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** పైలెట్ రోహిత్‌రెడ్డి ఫాంహౌస్‌లో పార్టీ కేసు దర్యాప్తులో కొత్తగా తెరమీదకు వచ్చిన డ్రగ్స్ విక్రేత అభిషేక్‌సింగ్ కోసం సిట్ నాలుగు ప్రత్యేక బృందాలతో గాలిస్తోంది. అభిషేక్‌సింగ్ చిక్కితే... రోహిత్‌రెడ్డితో ఉన్న సంబంధం, గతంలో ఎప్పుడైనా డ్రగ్స్ విక్రయించాడా? ఇంకా ఎవరెవరికి సరఫరా అయింది? తదితర అనేక ప్రశ్నలకు సమాధానాలు దొరికే అవకాశముంది. సాంకేతిక ఆధారాలు, సన్నిహితులు ఇచ్చిన సమాచారం ఆధారంగా అభిషేక్‌సింగ్ కోసం నాలుగైదు ప్రాంతాల్లో వెతుకుతున్నారు. మరోవైపు సిట్ అధికారులు నిందితుల్లో ఏడుగుర్ని గురువారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో విచారించారు. అభిషేక్‌సింగ్ గురించి సమాచారమిచ్చిన రోహిత్‌రెడ్డి డ్రైవరు, వ్యక్తిగత సహాయకుడు సిలివేరి శరత్, శిమ్లా నుంచి కొకైన్ తెచ్చినట్లు పోలీసుల్ని తప్పుదోవ పట్టించిన కౌశిక్ రవిలను ప్రత్యేకంగా విచారిస్తున్నారు. వీరి కాల్ డేటాను విశ్లేషిస్తున్నారు. పట్టుబడిన 11 మంది నిందితుల మధ్య ఆర్థిక లావాదేవీలపై సిట్ దృష్టిసారించింది. వారి బ్యాంకు ఖాతాల లావాదేవీలను సిట్ సభ్యులు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఎవరెవరి మధ్య ఎలాంటి లావాదేవీలు జరిగాయనే అంశాలను సేకరిస్తున్నారు. ఈ కేసులో నిందితులు 11 మందికి.. నిర్మాణరంగం, పబ్బులు, ఇతర వ్యాపారాలు ఉన్నాయి. వేర్వేరు ప్రాంతాలకు చెందిన వీరందరి మధ్య స్నేహం ఎలా మొదలైంది? వ్యాపార సంబంధాలేమిటి అనే దానిపై అధికారులు విచారిస్తున్నారు. ప్రధానంగా ఈ నెల 14న డ్రగ్స్ పార్టీ సమయంలో... పోలీసులు వచ్చే ముందు తుపాకీతో కాల్పులు ఎందుకు జరపాల్సి వచ్చిందని ఆరా తీస్తున్నారు. రోహిత్‌రెడ్డి, రితేశ్‌రెడ్డి ఆదేశాలతో కాల్పులు జరిపినా, ఇతర కారణాలున్నాయా? అదే రోజు డ్రగ్స్ పార్టీ చేసుకోవడం వెనుక ఉద్దేశం.. తదితరాలను తెలుసుకోవడానికి నిందితుల్ని వేర్వేరుగా ప్రశ్నిస్తున్నారు. ప్రధాన నిందితులు, ప్రస్తుతం చంచల్‌గూడ జైల్లో ఉన్న రోహిత్‌రెడ్డి, రితేశ్‌రెడ్డి, నమిత్‌శర్మ కస్టడీ పిటిషన్‌పై శుక్రవారం తీర్పు రానుంది. కస్టడీకి ఆదేశాలొస్తే విచారణలో వీరు చెప్పే సమాధానాల ఆధారంగా మరికొందరి పేర్లు తెరమీదకు వచ్చే అవకాశముందని పోలీసులు చెబుతున్నారు. హైప్రొఫైల్ కేసు కావడంతో విచారణలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ఓ అధికారి చెప్పారు.

# ఫాంహౌస్‌లో రహస్య కెమెరాలు, అత్యాచారాలు..

### జ్యోతిష్కుడి అరెస్ట్
### పెన్‌డ్రైవ్‌లో 58 మంది మహిళల వీడియోలు



**ముంబయి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆధ్యాత్మికత ముసుగులో 35 ఏళ్ల మహిళపై పదే పదే అత్యాచారానికి పాల్పడిన అశోక్ ఖరాత్ (67) అనే ప్రముఖ జ్యోతిష్కుడిని అరెస్టు చేసినట్లు మహారాష్ట్రలోని నాసిక్ పోలీసులు తెలిపారు. వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి పూజలు చేసే నెపంతో మత్తుమందు ఇచ్చి, లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొంది. ఇతడి ఫాంహౌస్‌లో పలు రహస్య కెమెరాలను కనుగొన్నారు. పోలీసుల విచారణలో దొరికిన పెన్‌డ్రైవ్‌లో మరో 58 మంది మహిళలపై చిత్రీకరించిన అసభ్యకరమైన వీడియోలు ఉన్నట్లు వెల్లడైంది. రిటైర్డ్ మర్చంట్ నేవీ అధికారిగా ప్రచారం చేసుకున్న నిందితుడు తనను తాను 'కెప్టెన్'గా చెప్పుకునేవాడు. ఈ కేసు విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఐపీఎస్ అధికారి ఆధ్వర్యంలో సిట్‌ను ఏర్పాటు చేసింది. మహారాష్ట్రలోని పలువురు ప్రముఖ రాజకీయ నేతలతో అశోక్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి.

# పెళ్లి పేరుతో మహిళల్ని తరలించారా..?

### కుమురంభీం జిల్లా బెజ్జూరులో కలకలం

**బెజ్జూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** పేదరికాన్ని ఆసరా చేసుకుని కొందరు దళారులు.. స్థానిక మహిళలను రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్నారని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మంచి సంబంధాలంటూ నమ్మించి, అందినకాడికి దండుకుని మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి ప్రాంతాల్లోని వారికి విక్రయించి అక్కడి వారితో వివాహాలు జరిపించినట్లు కుమురంభీం జిల్లా బెజ్జూరు మండలంలో ఓ సంఘటన కలకలం రేపుతోంది. పోలీసుల కథనం ప్రకారం.. బెజ్జూరు మండలానికి చెందిన ఇద్దరు మహిళలు మంచిర్యాలకు పని నిమిత్తం వెళ్లారు. అక్కడ మంచిర్యాల, మహారాష్ట్రలోని సిరోంచా ప్రాంతాలకు చెందిన వ్యక్తులు పరిచయమయ్యారు. ఆ ఇద్దరు మహిళల పేదరికం, అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని పెళ్లి చేస్తామని నమ్మించి, వారి నుంచి సెల్‌ఫోన్లు తీసుకుని ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు తీసుకెళ్లారు. కొద్దిరోజులుగా వారిద్దరి నుంచి సమాచారం లేకపోవడం, ఆచూకీ తెలియకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు అప్పట్లోనే అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా ఆ మహిళలకు అక్కడి వ్యక్తులతో వివాహాలు జరిగినట్లు తెలుసుకున్నారు. రెండు, మూడు రోజుల కిందట వారిని సొంత గ్రామాలకు తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. స్థానిక, పట్టణానికి చెందిన వ్యక్తులు వివాహాల పేరుతో మహిళలను తరలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కాగా మహిళల రవాణా కేసులో పలువురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. పూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

# బాలికను గర్భవతిని చేసిన అర్చకుడు

### పోక్సో కేసు నమోదు.. అరెస్టు

**మచిలీపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఓ అర్చకుడు తమ పొరుగింటి బాలిక (17)ను గర్భవతిని చేశాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఆర్.పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డీఎస్పీ ధర్మేంద్ర ఈ కేసు వివరాలను గురువారం వెల్లడించారు. నగరంలో పనిచేసే ఓ అర్చకుడి (41) ఇంట్లో బాలిక కుటుంబం అద్దెకు ఉంటోంది. ఇంటర్ చదువుతున్న బాలిక అర్చకుడి కుటుంబసభ్యులతో చనువుగా ఉండేది. డిసెంబరు 31న కొత్త సంవత్సర వేడుకల పేరుతో, జనవరిలో సినిమాకని, ఫిబ్రవరిలో తిరునాళ్లకంటూ ఆ బాలికను తన భార్యాపిల్లలతో కలిసి తీసుకెళ్లాడు. మూడుసార్లూ తాము వచ్చేసరికి పొద్దుపోతుందని, తమ పిల్లలతో కలిసి పడుకుంటుందని బాలిక తల్లిదండ్రులకు చెప్పాడు. ఇంటికి వచ్చాక భార్యాపిల్లలు నిద్రించాక బాలికను భయపెట్టి లొంగదీసుకున్నాడు. ఎవరికైనా చెబితే నీకే నష్టమని భయపెట్టడంతో బాలిక ఎవరికీ చెప్పలేదు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై అనుమానం వచ్చిన తల్లిదండ్రులు వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా బాలిక గర్భం దాల్చిందని చెప్పడంతో నిర్ఘాంతపోయారు. బాలికను గట్టిగా అడగడంతో ఈ ఘోరం బయటపడింది. అర్చకుడిపై అత్యాచారం, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. డీఎస్పీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# అప్పుల బాధలు, అనారోగ్య సమస్యలు.. వామ్మో ఈ మూడు రాశుల వారు జాగ్రత్త సుమా!


జ్యోతిష్య శాస్త్రంలో శని, కుజ గ్రహాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఈ రెండు గ్రహాలు చాలా వరకు చెడు ఫలితాలను ఇస్తుంటాయి. కానీ కొన్ని సార్లు ఈ గ్రహాల అనుగ్రహం ఉంటే మాత్రం ఆ రాశుల వారి పంట పండినట్లే. అయితే అతి త్వరలో కుజ గ్రహం సంచారం చేయనుంది. అంతే కాకుండా శని గ్రహంతో సంయోగం చెందనుంది. ఇది అనేక రకాల సమస్యలకు కారణం కానున్నదంట. దీని గురించి ఇప్పుడు మనం వివరంగా తెలుసుకుందాం. శని గ్రహాన్ని న్యాయ గ్రహం అని పిలుస్తారు. కర్మల ఫలితంగా ఇది ఫలితాలను ఇస్తుంది. ప్రస్తుతం శని గ్రహం మీన రాశిలో సంచారం చేస్తుంది. ఈ క్రమంలోనే ఏప్రిల్ నెలలో కుజ గ్రహం రాశి సంచారం చేయనుంది. ఇది మీన రాశిలోకి ప్రవేశించనుంది. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం ఇది చాలా తీవ్రమైన పరిమాణాన్ని సృష్టిస్తుంది. దాదాపు కుజ గ్రహం 18 నెలలపాటు మీన రాశిలోనే సంచారం చేయనుంది. అయితే ఇది 12 రాశులపై దాని ప్రభావం చూపుతుందంట. ముఖ్యంగా మూడు రాశుల వారిపై మాత్రం చాలా చెడు ప్రభావం చూపున్నదంట. ఇంతకీ ఆ రాశులు ఏవి అంటే? కుజ గ్రహం ఏప్రిల్ 2న మీన రాశిలోకి ప్రవేశించి, శని గ్రహంతో సంయోగం చెందుతాడు. అయితే ఇది చాలా తీవ్రమైన సమస్యలకు కారణం అవుతుందంట. ముఖ్యంగా మేష రాశి, కన్యా రాశి, మీన రాశి వారికి ఆర్థికంగా, ఆరోగ్యపరంగా




అనేక సమస్యలు సృష్టిస్తుందంట. అందుకే ఈ మూడు రాశుల వారు కుజ, శని గ్రహాల సంయోగం సమయంలో చాలా జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నారు జ్యోతిష్య శాస్త్ర నిపుణులు. ఇంతకీ ఆ రాశులు ఏవి అంటే?

**మేష రాశి :** మేష రాశి వారికి మానసిక ఒత్తిడి పెరుగుతుంది. ఏ పని చేసినా కలిసి రాదు, పని మధ్యలో ఆగిపోయే ఛాన్స్ ఉంది. అంతే కాకుండా అనారోగ్య సమస్యలు అధికం అవుతాయి. అనుకోని ప్రయాణాలు చేయాల్సి వస్తుంది. ఇవి లాభం కంటే నష్టాన్నే ఎక్కువ మిగుల్చుతాయి. అనేక రకాలుగా ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

**కన్యా రాశి :** కన్యా రాశి వారికి శని, కుజ గ్రహాల సంయోగం అనేక ఇబ్బందులను, ఒడిదొడుకులను తీసుకొస్తుంది. పనిలో నిర్లక్ష్యం ఎక్కువగా ఉంటుంది. పని చేయాలనే ఆలోచనే ఉండదు. కుటుంబంలో కలహాలు



మానసిక స్థితిని ప్రభావితం చేస్తాయి. వైవాహిక జీవితం చాలా దారుణంగా ఉంటుంది. ప్రతి పనిలో అసంతృప్తి ఎక్కువగా ఉంటుంది. అంతే కాకుండా విద్యార్థులు కూడా కష్టానికి తగిన ఫలితం పొందలేరు. అలసట, నీరసం ఎక్కువగా ఉంటుంది. మాటపట్టింపుల వచ్చే ఛాన్స్ ఉంది. పై అధికారులతో మాట్లాడే ముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించడం మంచిది.

**మీన రాశి :** మీన రాశి వారు వ్యాపారంలో ఎక్కువగా నష్టాలు ఎదుర్కొంటారు. నిరుద్యోగులకు ఉద్యోగం పొందడం కలగానే మిగిలిపోతుంది. పనుల్లో ఆటంకాలు అధికం అవుతాయి. అప్పుల బాధలు వేధిస్తాయి. అనారోగ్య సమస్యల కోసం ఎక్కువ డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఉద్యోగంలో పని ఒత్తిడి అధికం అవుతుంది. అయినా కష్టానికి తగిన ఫలితం లభించదు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి
డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

శనివారం, 21 మార్చి 2026

4

www.viswamvoice.com


# ఉవ్వెత్తిన యువ కెరటం అజయ్ బాబు పుట్టినరోజు వేడుకలు

**జనసంద్రంతో పోటెత్తిన కళ్యాణి రైస్ మిల్ ఆవరణ - నియోజకవర్గ వ్యాప్తంగా భారీగా తరలి వచ్చిన అభిమానులు**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీ భవిష్యత్ నాయకుడు, యువ పారిశ్రామికవేత్త, అంచనాల కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు రాజకీయ వారసుడు వేగుళ్ల అజయ్ బాబు పుట్టినరోజు వేడుకలు శుక్రవారం మండపేట ఏడిద రోడ్ కళ్యాణి రైస్ మిల్ ఆవరణలో ఆయన అభిమానులు భారీ జనసంద్రంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ నలుమూలల నుండి టీడీపీ నాయకులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని దుస్సాల్వాలు, గజమాలలు, పుష్పగుచ్చాలతో శుభాకాంక్షలు తెలిపి కేకులు కట్ చేయించారు. ఆయన అభిమానులు ప్రత్యేకంగా తయారు చేయించిన భారీ కేకును కట్ చేశారు. అనంతరం అందరికీ స్వీట్లు పంచి పెట్టారు. అందరికీ అందుబాటులో ఉంటూ నిత్యం ప్రజా సేవలో మమేకమవుతూ, ఎమ్మెల్యే వేగుళ్ళకు రాజకీయ వారసుడిగా చేతోడు వాదోడుగా ఉంటున్న యువ నాయకుడు వేగుళ్ళ అజయ్ బాబు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించి తండ్రికి మించిన తనయుడుగా పేరు తెచ్చుకోవాలని పలువురు కొనియాడారు. ఈ పుట్టినరోజు వేడుకల్లో అంచనా కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, రాష్ట్ర నీటిపారుదల సంస్థ అభివృద్ధి



చైర్మన్ వేగుళ్ల లీలా కృష్ణ లు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, భవిష్యత్తులో మరింత ఉన్నత పదవులు అధిరోహించలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ,వార్డుల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# నటభూషణ్ శోభన్ బాబు 18వ వర్ధంతి ఘన నివాళి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అందాల నటుడు నటభూషణ్ శోభన్ బాబు 18వ వర్ధంతిని పురస్కరించుకుని శోభన్ బాబు సేవా సమితి రాజమహేంద్రవరం ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరి బండ్ రోడ్ లో ఉన్న శోభన్ బాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి గౌరవ సలహాదారు బళ్ళా శ్రీనివాసరావు మాట్లాడుతూ నేటికీ అభిమానులు ఇంతటి అభిమానం చూపుతున్నారంటే ఆయన తెలుగు సినిమా ఉన్నంతకాలం తెలుగు ప్రజల హృదయాలలో తమ విలక్షణమైన నటనతో సుస్థిరమయిన స్థానం సంపాదించుకున్నందుకేనని అన్నారు,ఆయన మా అభిమానులందరికీ ఒక క్రమశిక్షణ అలవాటు చేసి మార్గదర్శిగా నిలిచారని అన్నారు.ఈ సందర్భంగా అభిమానులు మజ్జిగ పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు కొనకళ్ల శ్రీనివాస్ కుమార్,కార్యదర్శి పూడి శ్రీనివాస్, కే ఆనంద్,ఎస్ఎన్ రావు,ఎవీవీఎస్డీ ప్రసాద్ (సోగ్గాడు ప్రసాద్), ఏ అన్నవరం,ఆర్వీబీఎస్ శర్మ, కె ప్రసాద్,నవాబ్ పాలెం శర్మ, వీబీ శంకర కుమార్, పీ.శివ కేశవ శర్మ, ఎమ్ ప్రకాష్, జి సింహాచలం, జె.త్రినాథ్(వైజాగ్), చాముండేశ్వరనాథ్(ఏలూరు), కేవీస్ ప్రకాశరావు,వి న్యుటన్ బాబు, ఎమ్ సూర్యనారాయణ,సూర్యనారాయణ మురమండ, మొతికి సత్యనారాయణ, ఏలూరు,తణుకు, కాకినాడ, భీమవరం,అమలాపురం, వైజాగ్ శోభన్ బాబు సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం ఆయుష్మాన్ కేంద్రంలో

# నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ టీం తనిఖీ



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల సీతానగరం-2 ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ (ఏఏఎం)లో నేషనల్ క్వాలిటీ స్టాండర్డ్స్ టీం ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు అందుతుంది ఆరోగ్య సేవలు అవసరమైన పరికరాలు వాటి నిర్వహణ గురించి వర్చువల్ గా తనిఖీ చేయడం జరిగింది .ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా ఎన్ క్యు ఏ ఎస్ కన్సల్టెంట్ డాక్టర్ సుధ మాట్లాడుతూ నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించే నిమిత్తమై ప్రభుత్వం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను నిర్మించిందని 14 రకాల టెస్టులు 105 రకాల మందులు ఇక్కడ అందుబాటులో ఉంచిందని వీటిని ప్రజలు పూర్తిగా వినియోగించుకోవాలని చెప్పారు. సీతానగరం 2ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి ఎన్ క్యూ ఏ ఎస్ నుండి వారం రోజుల్లో ధ్రువీకరణ పత్రం వస్తుందని చెప్పారు .ఈ కార్యక్రమంలో సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ చైతన్య, డా.ఎం శైలజా రాణి సీతానగరం గ్రామ సర్పంచ్ కె. ముత్యాలు, ఎంపిహెచ్ ఈ ఓ వై.ఎస్ రాయుడు, పి హెచ్ ఎన్ దైవకృప,సూపర్వైజర్లు కె.సుధాకర్, ఎంఎల్ హెచ్పి జి.బేబీ స్వరూప, ఏఎన్ఎంలు ఎస్.కె సలీమాభి, కె.శారద, వి.సంధ్య, హెల్త్ అసిస్టెంట్ పి.నందీస్, ఆశా కార్యకర్తలు ఎం.కుమారి, ఎం.జ్యోతి మొదలగు వారు పాల్గొన్నారు.

యువతకు ఉగాది కానుకగా

జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించిన

# కూటమి ప్రభుత్వం

**హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే వేగుళ్ళ**



**మండపేట టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని యువతకు బంగారు భవిష్యత్ అందించేందుకు నూతన సంవత్సర కానుక గా కూటమి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకటించడం పై రాష్ట్ర అంచనాల కమిటి చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్ అంటే కేవలం ప్రకటన మాత్రమే కాదని పేర్కొన్నారు .అది నిరుద్యోగులకు ఇచ్చే ఒక భరోసా అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఇప్పటికే 20 నెలల్లోనే 6,28,347 ఉద్యోగాలను యువతకు అందించడం జరిగిందన్నారు. వీటితో పాటు రూ.23 లక్షల కోట్ల పెట్టుబడితో 25 లక్షల ఉద్యోగ అవకాశాలు సృష్టించే కంపెనీలతో కూటమి ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం జరిగిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో యువత భవిష్యత్ ను సర్వ నాశనం చేశారని దుయ్యబట్టారు. ఎన్నికల ముందు 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ, ప్రతీ ఏటా జాబ్ క్యాలెండర్ అన్న జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక నిరుద్యోగుల్ని నిలువునా మోసం చేయటంతో ఉద్యోగాలు, ఉపాధి లేక వేలాదిమంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. చంద్రబాబు నాయుడు విధ్యార్థి, యువతకు అన్ని విధాల అండగా నిలిస్తే జగన్ రెడ్డి మాత్రం తన అవినీతి, అరాచక పాలనతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేసి యువత భవిష్యత్ ను ప్రశ్నార్థకం చేశారని ఎమ్మెల్యే అన్నారు.

# దేవునికి మహిమకరంగా సాగిన బైబిల్ మిషన్ మహాసభలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బైబిల్ మిషన్ హెడ్ ఆఫీస్, గుంటూరు పర్యవేక్షణలో రాజమండ్రిలో బైబిల్ మిషన్ మహాసభలు మూడు రోజులపాటు దేవునికి మహిమ కరంగా జరుగుతున్నాయి. స్థానిక జెఎన్. రోడ్డులోని చెరుకూరి వీర్రాజు కళ్యాణమండపం, డి వన్ ఫంక్షన్ హాల్, సూర్య కళ్యాణ మండపంలో ఈ మహాసభలు జరుగుతున్నాయి. బైబిల్ మిషన్ అధ్యక్షులు, బేతేలు గృహవాసులు, కాకాని స్వస్థత శాల నిర్వాహకులు రెవరెండ్ డాక్టర్ సామ్యూల్ కిరణ్ ముఖ్య అతిథిగా హాజరై దైవ సందేశాన్ని అందించారు. ప్రభువైన ఏసుక్రీస్తు ఈ ప్రపంచానికి రక్షణ కర్తయని, ఆయన శాంతిని, సమాధానాన్ని మనుషులందరికీ అనుగ్రహించువాడని తెలియజేశారు.నేడు ప్రపంచంలో ఉన్న మనుషులందరూ ఎన్నో భయాందోళనల మధ్య బ్రతుకుతున్నారని, మానవునికున్న ప్రతి భయం, భీతి, విచారాలను ఆయన తొలగించువాడై ఉన్నాడని ప్రకటించారు. అనేకమంది ధనం,గౌరవం, అధికారం, లౌకిక ప్రాయమైన లోకవాంఛలతో నింపబడ్డారని వాటిని వదిలి సహోదర ప్రేమ కలిగి నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించాలని ఏసుక్రీస్తు చెప్పిన మాటలు జ్ఞాపకం చేశారు. ప్రజలందరూ కృప క్షేమాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు.ఈ సభలలో రెవరెండ్ జాన్ బాబు, వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ జే ఆగమనరావు, జాయింట్ సెక్రెటరీ రెవరెండ్ డి సుధాకర్, ఎం సజీవరావు, గవర్నింగ్ బాడీ సభ్యులు హాజరై దేవుని వాక్యాన్ని అందించారు. సెక్రటరీ ప్రశాంత్ కుమార్ మహాసభలకు హాజరైన భక్తులందరికీ వసతి సౌకర్యంతో పాటు భోజన ఏర్పాట్లను చేశారు. మహాసభలకు హాజరైన భక్తులందరూ దైవ సేవకులచే ప్రార్థనలు చేయించుకుని దీవెనలు పొందారు.

# పారిశుధ్య నిర్వహణ ప్రత్యేక దృష్టి

**బాధ్యతలు చేపట్టిన ప్రత్యేక అధికారి - ప్రత్యేక అధికారి ఆర్‌డి నాగ నరసింహారావు**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట పురపాలక సంఘం ప్రత్యేక అధికారి రాజమహేంద్రవరం రీజినల్ డైరెక్టర్(ఆర్డీ) మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సి హెచ్ నాగ నరసింహారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. మొన్నటి వరకు చైర్ పర్సన్ ఛాంబర్‌గా ఉన్న ఛాంబర్ ను ప్రత్యేక అధికారి ఛాంబర్‌గా మార్చారు. ఆయన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఆయన్ని కమీషనర్ టీవీ రంగారావు, డిఇ శ్రీనివాస్ , ఆర్ఓ మాచిరాజు రవి, శానిటరీ ఇన్స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, టౌన్ ప్లానింగ్ అధికారి రమ్యశ్రీ, ఆర్ఐ కొత్తపల్లి సత్తిబాబు, మెప్మా సిఎంఎం పి.సుజాత, స్వర్ణ వార్డు మేనేజర్ దంటు శ్రీనివాస్, మేనేజర్ శ్రీనివాస్ లు స్వాగతం పలికారు. పుష్ప గుచ్ఛలు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఆర్డీ, మండపేట ప్రత్యేక అధికారి నాగ నరసింహారావు మాట్లాడుతూ మండపేట పురపాలక సంఘం పై పూర్తి అవగాహన ఉందన్నారు. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ పై దృష్టి సారించినట్లు చెప్పారు. పుర ప్రగతి కి కృషి చేస్తానని తెలిపారు. సమస్యలు ఏమైనా ఉంటే ప్రజలు నేరుగా తనని కలిసి చెప్పొచ్చన్నారు. తరచూ మండపేట వచ్చి పాలన పై దృష్టి పెడతానని చెప్పారు.

# రోడ్డుపై మురుగు నీటి సమస్యకు పరిష్కారం చూడండి

**ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరుకొండ రోడ్డులో నగర పాలక సంస్థ కమిషనర్ రాహూల్ మీనా, ఇతర అధికారులతో కలిసి పర్యటించారు. బ్రదరన్ చర్చ్ వద్ద మేజర్ డ్రైనేజి బ్లాక్ అయ్యి రోడ్డుపై మురుగు నీరు ప్రవహిస్తున్న విషయం తెలియడంతో ఆయన వెంటనే అక్కడకు చేరుకుని అధికారులతో మాట్లాడి సమస్యకు వెంటనే పరిష్కారం చూపించాలని ఆదేశించారు. అలాగే భవిష్యత్తులో ఇలాంటి సమస్య ఉత్పన్నం కాకుండా ఉండేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు.

పుస్తకం పట్టాల్సిన విద్యార్థులు

# చీపురు చేత పట్టారు



**దేవీపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** నేటి బాలలే రేపటి పౌరులు. పిల్లలు దేశ భవిష్యత్తుకు పునాదులు, వారి శారీరక, మానసిక వికాసం, నాణ్యమైన విద్య, ఆరోగ్యంపైనే దేశ అభివృద్ధి ఆధారపడి ఉంటుంది. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అన్నట్లు, నేటి చిన్నారులే రేపటి భారత నిర్మాణ కర్తలు, వారిని సరైన మార్గంలో పెంచడం, బాలకార్మిక వ్యవస్థను అరికట్టడం సమాజ బాధ్యత. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో, పిల్లల ఆటస్థలాల్లో రూపుదిద్దుకుంటుంది. ఏ దేశమైనా అభివృద్ధి చెందాలంటే ఆ దేశంలోని పిల్లలకు సరైన విద్య, ఆరోగ్యం, సంరక్షణ లభించాలి. కానీ రంపచోడవరం నియోజకవర్గం నియోజకవర్గంలో పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంటుంది. ఉదయం లేవగానే విద్యార్థులకు చీపురు చేతిలో పెట్టి ఆశ్రమ పాఠశాల మొత్తం శుభ్రం చేయిస్తారు. వివరాలలోకి వెళ్తే రంపచోడవరం నియోజకవర్గం దేవీపట్నం మండలం కొత్తవీధి బాలుర ఆశ్రమ పాఠశాలలో ఆరవ తరగతి నుండి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులతో వెట్టి చాకిరి చేయిస్తున్నారు. సిబ్బంది ఎవరూ లేకపోవడం తో వంట మనిషిగా పని చేస్తున్న వ్యక్తి మాత్రం వారితో దగ్గర ఉండి పని చేయిస్తున్నాడు. పైగా ఉపాధ్యాయులు వచ్చే సరికి శుభ్రం చెయ్యకపోతే తిడతారు అనడం గమనార్హం.చదువుకోవాల్సిన చోట ఇలా విద్యార్థులు బాల కార్మికులుగా మార్చిన పాఠశాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి.

గ్రామ కమిటీలు అనుబంధ కమిటీలకు

# దిశా నిర్దేశం : జక్కంపూడి

**-పార్టీ కోసం పనిచేసే వారికి ప్రాధాన్యత**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రానున్న రోజుల్లో రాజానగరం మండలంలో వైయస్సార్ సిపి తరఫున చేపట్టవలసిన కార్యక్రమాలపై వైఎస్ఆర్సిపి రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు రాజానగరం మాజీ శాసనసభ్యులు జక్కంపూడి రాజా పార్టీ శ్రేణులకు దీశా నిర్దేశం చేశారు. శుక్రవారం రాజానగరం ఎస్పీ రాజు ఫంక్షన్ హాల్‌లో గ్రామకమిటీల అధ్యక్షులు, అనుబంధం విభాగాల అధ్యక్షులు, మండల కమిటీ సభ్యులతో పార్టీ తరఫున చేపట్టవలసిన కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జక్కంపూడి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఐదు అంకెల్లో కమిటీలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసుకున్నమన్నారు.రానున్న రోజుల్లో ఏ విభాగానికి సంబంధించిన సమస్యలపై ఆయా విభాగాల కమిటీసభ్యులు ప్రజలతో మమేకమై, సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేయాలన్నారు.గ్రామ కమిటీ అధ్యక్షులు బాధ్యత తీసుకుని ఆయా గ్రామాల్లో ఉండే అనుబంధ కమిటీలకు ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేయాలన్నారు. ప్రతి కార్యకర్తకు ఇన్సూరెన్స్ వర్తించే విధంగా నాయకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పార్టీ పిలుపు మేరకు పనిచేసే కార్యకర్తలకు రానున్న రోజుల్లో పార్టీ తరఫున తగిన గుర్తింపుని, వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాజానగరం మండల కమిటీసభ్యులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మా 'విశ్వం వాయిస్' వాట్సాప్ ఛానల్‌లో జాయిన్ అవ్వండి!

నిజాయితీ గల వార్తలు.. నిరంతర అప్‌డేట్స్!

- ⚡ బ్రేకింగ్ న్యూస్ అప్‌డేట్స్
- 🗞 రోజువారీ తెలుగు దినపత్రిక PDF
- 🌎 అంతర్జాతీయ, జాతీయ వార్తలు
- 📊 విశ్లేషణాత్మక కథనాలు

VISWAM VOICE BREAKING NEWS
WhatsApp channel

మీ ఫోన్ కెమెరాతో స్కాన్ చేసి గ్రూపులో చేరండి

JOIN NOW

లింక్ ద్వారా కూడా జాయిన్ అవ్వండి:
https://whatsapp.com/channel/0029Va7zLL1E50Uhr9gpAR1E

మాతో పాటు మరిన్ని వార్తలు మరియు తాజా అప్‌డేట్స్ తెలుసుకోండి.



మధ్యాహ్న భోజన పథకంపై

# మంత్రి సుభాష్ ఆకస్మిక తనిఖీ

## విద్యార్థులతో కలిసి నేలపై భోజనం చేసిన మంత్రి - చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు : మంత్రి సుభాష్




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రామచంద్రపురం పట్టణంలోని చింతపల్లి సూరన్న నగర్ హై స్కూల్‌ను సందర్శించిన మంత్రి, అక్కడ అందిస్తున్న భోజనాన్ని స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ విద్యార్థులతో కలిసి నేలపై కూర్చుని భోజనం చేసి, ఆహార నాణ్యతను తెలుసుకున్నారు. భోజనం ఎలా ఉంది? రుచిగా ఉందా? సరిపడినంతగా పెడుతున్నారా?" అంటూ విద్యార్థులతో చర్చిస్తూ వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. అంతేకాకుండా చదువుల పరిస్థితి, పరీక్షల సన్నాహకంపై కూడా ఆరా తీశారు. మంత్రి సుభాష్ ఆకస్మికంగా పాఠశాలకు రావడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు కొంతసేపు ఆశ్చర్యానికి గురయ్యారు. మంత్రి హైస్కూల్ సందర్శన, విద్యార్థులతో ముచ్చటించిన తీరుతో విద్యార్థుల్లో ఉత్సాహం నింపింది. ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకు రావచ్చని మంత్రి సుభాష్ విద్యార్థులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

# యువగళం స్ఫూర్తితో ఉద్యోగాల క్యాలెండర్ విడుదల



### ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

**విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి**

అమలాపురం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు మాట్లాడారు. ఉగాది సందర్భంగా రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తూ ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లోనే యువతకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించిందని పేర్కొన్నారు. ఈ కాలంలో మెగా డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్, లెక్చరర్, అంగన్వాడీ పోస్టుల ద్వారా సుమారు 30,607 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు వివరించారు. అలాగే ప్రైవేటు రంగంలో సుమారు 6,28,347 మందికి ఉపాధి కల్పించడం గర్వకారణమన్నారు. ఇందులో ఎంఎస్ఎంఈల ద్వారా 2,48,906 మందికి, జాబ్ ఫెయిర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాల ద్వారా 1,46,627 మందికి ఉపాధి లభించిందని తెలిపారు. పారిశ్రామిక రంగంలో 95,174, ఫుడ్ ప్రాసెసింగ్‌లో 64,035, ఐటీ మరియు ఎలక్ట్రానిక్స్ రంగంలో 13,866, పర్యాటక రంగంలో 5,028 ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. భవిష్యత్తులో సుమారు 23 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించి 21 లక్షల ఉద్యోగాలు సృష్టించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. త్వరలో జాబ్ క్యాలెండర్ ప్రకారం గ్రూప్-1, గ్రూప్-2 పోస్టులు, 3000 జూనియర్ లెక్చరర్ పోస్టులు, 1000 పోలీస్ ఉద్యోగాలు, కొత్త డీఎస్సీ, యూనివర్సిటీల్లో 1500 ఖాళీల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల కానున్నాయని తెలిపారు. మొత్తం 25 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ, జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను మోసం చేశారని, డీఎస్సీ నిర్వహించక విద్యా వ్యవస్థను దెబ్బతీశారని అన్నారు. ఉపాధి లేక రాష్ట్రంలో వేలాది మంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడటం ఆ ప్రభుత్వ వైఫల్యానికి ఉదాహరణ అని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా నడిపించేందుకు యువత కూటమి ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణ బాబు మాట్లాడుతూ, గతంలో రాష్ట్రంలో నిరుద్యోగిత అధికంగా ఉందని, ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ ముందుకు సాగుతోందన్నారు. సమావేశంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, నల్లా స్వామి, కర్రి రామస్వామి, మాడ మాధవి, బొర్రా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రావులపాలెం మండల బీజేపీ అధ్యక్షుడిగా ఈశ్వర్ రెడ్డి



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండల భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నూతన అధ్యక్షుడిగా కొవ్వూరి ఈశ్వర్ రెడ్డి ఎన్నికయ్యారు. పార్టీ అంతర్గత ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈ నియామకం జరిగింది. జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమ, రాష్ట్ర బీజేపీ నాయకులు తమనంపూడి రామకృష్ణారెడ్డి సమక్షంలో ఎన్నికల అధికారి చికూరుమిల్లి శ్రీనివాస్ ఈ ఫలితాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన నాయకత్వంలో మండలంలో బీజేపీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# స్వర్ణాంధ్ర లక్ష్యంగా ఉద్యోగాల విప్లవం

**నిరుద్యోగ నిర్మూలన దిశగా దూసుకెళ్తున్న కూటమి ప్రభుత్వం - 20 నెలల్లో 6.28 లక్షల ఉద్యోగాలు కల్పన**

**కొత్త జాబ్ క్యాలెండర్ ద్వారా మరో 10,060 ఉద్యోగాలు - మీడియా సమావేశంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో నిరుద్యోగాన్ని పూర్తిగా నిర్మూలించి యువతకు విస్తృతంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. శుక్రవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లోనే 6,28,367 ఉద్యోగాలను కల్పించి మంచి ప్రభుత్వంగా గుర్తింపు పొందిందన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ ద్వారా మరో 10,060 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి సంతకం డీఎస్సీ నియామకాలపై చేసి 16,437 ఉపాధ్యాయ ఉద్యోగాలను విజయవంతంగా భర్తీ చేసినట్లు తెలిపారు. అలాగే 6,000 పోలీస్ కానిస్టేబుల్ పోస్టులను కూడా పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని, రాష్ట్రానికి పెరుగుతున్న పెట్టుబడుల కారణంగా ఈ లక్ష్యాన్ని మించి అవకాశాలు సృష్టిస్తామని మంత్రి స్పష్టం చేశారు. అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను భర్తీ చేసే దిశగా చర్యలు వేగవంతం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 20 లక్షల మంది కార్మికులు ఉన్నారని, వారి కుటుంబాలతో కలిపి కోటి మందికి పైగా ప్రజల జీవనోపాధి కార్మిక రంగంపైనే ఆధారపడి ఉందని చెప్పారు. వారి పని దినాలు, జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్మిక శాఖలో ఇటీవల వివిధ కేటగిరీలలో 32 ఉద్యోగాలను భర్తీ చేసినట్లు వివరించారు. గత వైసీపీ పాలనలో యువతకు తగిన అవకాశాలు ఇవ్వలేదని మంత్రి విమర్శించారు. యువత దారితప్పే పరిస్థితులు ఏర్పడ్డాయని ఆరోపించారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రం "స్వర్ణాంధ్ర" దిశగా వేగంగా పయనిస్తోందని తెలిపారు. గొప్ప దూరదృష్టి కలిగిన నాయకుడు సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని మంత్రి సుభాష్ ప్రశంసించారు.

# ఘనంగా జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ పుట్టినరోజు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా కొత్తపేట మండలం మోడెకుర్రు గ్రామ జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఆనంతరం మోడెకుర్రు పంచాయతీ పారిశుధ్య కార్మికులకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్.సి సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా సురేష్ కుమార్



**రాజోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజోలు మండల ఏస్‌సి సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా మట్టా సురేష్ కుమార్ ఎన్నిక అయ్యారు. రాజోలు అంబేద్కర్ కమ్యూనిటీ భవనంలో జరిగిన షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం సమావేశంలో సురేష్ కుమార్‌ను మండల అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సురేష్ రాజోలు మండల ఎస్సి (మాల) జేఏసి అధ్యక్షుడుగాను, దళిత చైతన్య వేదిక ఎగ్జిక్యూటివ్ మెంబర్ గాను, రాజోలు అంబేద్కర్ కమ్యూనిటీ భవన అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శిగాను కొనసాగుతున్నారు. రాజోలు మండల నూతన ఎస్సీ సంక్షేమ సంఘం అధ్యక్షుడుగా నియమితులైన సురేష్ మాట్లాడుతూ షెడ్యూల్ కులాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఆయనకు ఈ పదవి లభించేందుకు కృషి చేసిన పాలమూరి శ్యాంబాబు, బత్తుల మురళీ కృష్ణ, గేదెల వరలక్ష్మి, చిలకపాటి శ్రీధర్, లిఖితపూడి బుజ్జి,విప్పర్తి సాయిబాబు, దీపాటి శివ ప్రసాద్, ఉప్పే జగదీష్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆలయ శంకుస్థానలో పాల్గొన్న ఎమ్మెల్యే దాట్ల



**ఐ.పోలవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరేశ్వరస్వామి ఆలయ జీవనోద్ధరణ, పునర్నిర్మాణ కార్యక్రమానికి గౌరవ ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత ఆలయాన్ని పూర్తిగా తొలగించి, రాతి నిర్మాణంతో శాశ్వతంగా నిలిచే విధంగా నూతన ఆలయాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వం తరఫున రూ. 4 కోట్ల నిధులు మంజూరు అయినట్లు వెల్లడించారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం సుమారు రూ. 10 నుండి 12 కోట్ల వరకు ఉండనున్నదని, మిగిలిన నిధుల సమీకరణకు భక్తులు, దాతలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అత్యంత మహిమాన్వితమైన ఈఆలయంలో మూలవిరాటును కదిలించకుండా, పీఠాధిపతుల సూచనలు, సలహాలతో పునర్నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నిర్మాణం పూర్తయ్యేంతవరకు స్థానిక ప్రజలు అధికారులు నాయకులు సహకారం ఉండాలని ఆశిస్తున్నట్టు తెలిపారు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఈ పునర్నిర్మాణ పనులను చేపడుతున్నట్టు వారు పేర్కొన్నారు. దివంగత లోక్‌సభ స్పీకర్ జి.ఎం.సి. బాలయోగి కలగా ఉన్న ఈ ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమం ప్రారంభం కావడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు, ఆలయ అధికారులు. స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# కాళ్లకూరికి జిల్లా ఉగాది పురస్కారం



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలం పరిధిలో మూలస్థాన అగ్రహారం శివాలయం అర్చకులు ప్రముఖ శైవాగమ పండితులు కాళ్లకూరి సత్యనారాయణ మూర్తికి ఉత్తమ అర్చకులుగా ఉగాది పురస్కారం దక్కింది. శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉగాది వేడుకలు అమలాపురం కలక్టర్ కార్యాలయం వద్ద జరిగింది. జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఆర్డీవో జి.మమ్మీలు ఆయనను సత్కరించి ఈ పురస్కారం అందించారు. పురష్కారం అందుకున్న కాళ్లకూరిని ఆలయ చైర్మన్ ఉప్పులూరి సత్తిపండు, ఇవో ఎమ్.శివరామకృష్ణలు అభినందించారు.

చింతలూరు నూకాంబిక అమ్మవారి జాతరలో

# పోలీస్ బందోబస్తుకు సన్మానం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి ఆర్ అంబేత్కర్ కొనసీమ జిల్లా,కొత్తపేట నియోజక వర్గం ఆలమూరు మండలం చింతలూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానంలో నిర్వహిస్తున్న జాతర తీర్థ మహోత్సవం ఘనంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. డీఎస్పీ మురళీమోహన్, సీఐ విద్యాసాగర్, ఎస్సై జి. నరేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ నిర్వహిస్తూ, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. ట్రాఫిక్ నియంత్రణతో పాటు, జాతర ప్రాంగణంలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేశారు. ఈ క్రమంలో దేవస్థానం చైర్మన్ వీర్రి అప్పారావు పోలీసు సిబ్బందిని సన్మానిస్తూ కండువాలు కప్పి, అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. భక్తుల సౌకర్యార్థం పోలీసులు చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తుండగా, భక్తులు కూడా సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# జాబ్ క్యాలెండర్‌తో నిరుద్యోగులకు భరోసా : కొత్తపేట ఎమ్మెల్యే



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** జాబ్ క్యాలెండర్‌తో యువతకు అండగా కూటమి ప్రభుత్వం బండారు సత్యానందరావు యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ యువగలం పాదయాత్రలో నారా లోకేష్ యువతకు ఇచ్చిన హామీ ప్రకారం జాబ్ క్యాలెండర్ విడుదలకు కృషి చేసి యువతకు పెద్దన్నల వ్యవహించారు అని ప్రశాంశించారు. ఉగాది సందర్భంగా ప్రభుత్వం 10,060 ఉద్యోగాలతో జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. జాబ్ క్యాలెండర్లో ప్రధానంగా విద్య, పోలీస్ శాఖలకు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. ఇప్పటికే 20 నెలల్లోనే 6,28,347 ప్రైవేటు ఉద్యోగాలను యువతకు అందించడం జరిగిందన్నారు. వీటితో పాటు రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులతో 25 లక్షల ఉద్యోగ అవకాశాలు సృష్టించే కంపెనీలతో కూటమి ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించి భారీగా టీచర్ పోస్టులను భర్తీ చేసిందని, నేడు మరోసారి డీఎస్సీని, జూనియర్ లెక్చరర్ పోస్టుల కోసం 3,000 ఖాళీలను కేటాయించిందని,ఉన్నత విద్యను బలోపేతం చేసే దిశగా వివిధ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న 1,500 అధ్యాపక పోస్టులను భర్తీ చేస్తుందన్నారు. పరిపాలనా విభాగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాల కోసం దాదాపు 600 పోస్టులతో పాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసం 1,000 పోలీస్ కానిస్టేబుల్, 400 ఎక్సైజ్ కానిస్టేబుల్ పోస్టులు భర్తీ కాబోతున్నాయన్నారు. జాబ్ క్యాలెండర్ తో నిరుద్యోగులకు భరోసా లభిస్తుందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానన్న జగన్ రెడ్డి నిరుద్యోగుల్ని నిలువునా మోసం చేసి ఒక్క జాబ్ క్యాలెండర్ కూడా ప్రకటించలేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కొత్తగా రాష్ట్రానికి పరిశ్రమలు, పెట్టుబడులు రాకపోగా కమీషన్ల కోసం ఉన్న కంపెనీలను తరిమేసి 34 లక్షల మంది యువత భవిష్యత్ ను నాశనం చేశారన్నారు. జగన్ పాలనలో యువత ఉద్యోగాలు, ఉపాధి లేక వేలాదిమంది నిరుద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ హయాంలో కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నివేదిక ప్రకారం గ్రాడ్యుయేట్లలో 24 శాతం నిరుద్యోగంతో అప్పట్లో దేశంలోనే ఏపీ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు హామీ ఇచ్చిన విధంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయడం ద్వారా నిరుద్యోగుల పట్ల, యువత పట్ల ప్రభుత్వానికి ఉన్న బాధ్యతను తెలుపుతుందన్నారు.

# రంజాన్ ఆనందం పంచిన 'సత్యం వాసంశెట్టి ఫౌండేషన్'

**50 మందికి రంజాన్ తోఫా, చీరలు పంపిణీ - సత్యం వాసంశెట్టి పౌండేషన్ చైర్మన్**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణంలోని పెద్ద మసీదులో సత్యం వాసంశెట్టి పౌండేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు, రంజాన్ తోఫా కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 మంది ముస్లిం సోదరులకు మహిళలకు చీరలు, పురుషులకు బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, కూటమి పార్టీ నాయకులు పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రంజాన్ పర్వదినం ప్రేమ, సహనం, దయాగుణం, మానవత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. అందరినీ ప్రేమించాలి అనే అల్లా బోధనలు ప్రతి ఒక్కరూ అనుసరించాల్సినవని చెప్పారు. సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం పెంపొందించేందుకు ఈ పర్వదినం ప్రేరణనిస్తుందని అన్నారు. అనంతరం నేతలు ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ముస్లిం సమాజానికి ఎల్లప్పుడూ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని వాసంశెట్టి సత్యం భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, ఎండి నవాబ్ , భాష, అల్లావుద్దీన్, షేక్ కరిముల్లా, అలీషా కూటమి పార్టీ నాయకులు మేడిశెట్టి సూర్యనారాయణ, గడి గోవిందు, లంక శ్రీను, నారపురెడ్డి బలరాం, కంచుమర్తి బాబురావు, దంగేటి గౌరీ శంకర్, కవల నానాజీ, సంపత్, రాజేశ్వరి, పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంజాన్ తోఫా కార్యక్రమంలో వాసంశెట్టి సత్యం, ఏఎంసి చైర్మన్ అక్కల రిశ్వంత రాయ్, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ లను ఘనంగా ఆహ్వానించి సత్కరించారు.

# అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వ లక్ష్యం : అమూల్య




**రాజోలు, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి దిశగా నడిపించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గొల్లపల్లి అమూల్య అన్నారు. శుక్రవారం తాటిపాక గ్రామంలో అమూల్య క్యాంపు కార్యాలయం వద్ద ప్రజా సమస్యల పరిష్కార వేదిక "కేడర్ విత్ లీడర్" కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి కూటమి శ్రేణులు, ప్రజల నుండి వచ్చిన అర్జీలు స్వీకరించారు. ఈసందర్భంగా అమూల్య మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లోనూ ముందుకు నడిపిస్తోందని అన్నారు. ఈకార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంధాలయ సంస్థల చైర్మన్ భూపతిరాజు సాయిబాబా రాజు, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముదునూరి చినబాబు రాజు, రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గెడ్డం సింహ, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు చిటికెల రామ్మోహన్ రావు, మొల్లేటి శ్రీనివాస్, లంకే శ్రీనివాసరావు, బోణం సత్య నాగేశ్వరరావు, అనుచూరి సునీత రామ పురుషోత్తం, అడబాల సాయిబాబా, తాడి సత్యనారాయణ, సీనియర్ టీడీపీ నాయకులు జగడం సత్యనారాయణ, తాటిపాక సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, ఆయా గ్రామాల గ్రామశాఖ అధ్యక్ష కార్యదర్శులు, వివిధ పార్టీ బాధ్యతలలో ఉన్న నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చలో వీరవాసరం

**ప్రపంచంలో డాలర్ విలువ పెరగాలన్న తగ్గాలన్న ఇటు ఆక్వా అటు సాఫ్ట్వేర్‌పై ఆధారపడి ఉంది: నాగభూషణం**



**ముమ్మిడివరం విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచంలో డాలర్ విలువ పెరగాలన్న తగ్గాలన్న ఇటు ఆక్వా అటు సాఫ్ట్వేర్ పై ఆధారపడి ఉంది. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేది ఎప్పుడు రైతుల మనుగడను దూరం చేస్తున్న దళారీ వ్యవస్థ రైతుల నడ్డి విరుస్తున్న సిండికేట్ వ్యవస్థ 22వ తేదీ ఆదివారం వీరవాసరం తులసి కన్వెన్షన్ హాల్లో జరిగే ఆక్వా రైతుల సదస్సుకు వేలాదిగా తరలి వెళ్తున్న రైతులు, ఉభయ గోదావరి జిల్లాల నుండి హాజరు కాబోతున్న ఆక్వా రైతులు ప్రత్యక్షంగా పరోక్షంగా రైతులకు అండగా ఉండవలసిన ప్రభుత్వం ఆదరణ కరువై పూర్తిగా దళారీ వ్యవస్థలో ఆక్వా వ్యవస్థ నడుస్తుం టే దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు ఆందోళన చెందుతుంటే ఆక్వా రైతులకు కరెంటు సబ్సిడీలో గాని మేతల సబ్సిడీలో గాని రాయితీలు ఇవ్వాల్సిన ప్రభుత్వం నుండి ఏ విధమైన స్పందన లేక ఇటు దళారి వ్యవస్థ వలన అటు సిండికేట్ వ్యవస్థ వలన మధ్య విలవిలాడుతున్న ఆక్వా రైతులు. దళారి వ్యవస్థ నుండి ప్రభుత్వం ఈ సమస్యను పూర్తిగా తాత్సారం చేస్తుందంటూ ఆక్వా రైతులు మండిపడుతూ చేసేదేమీ లేక ప్రభుత్వం పై ఉద్యమించడానికి ఉద్యమ బాట పట్టిన ఆక్వా రైతులు. టాక్స్ లపై టాక్సు విధిస్తూ టన్నుకి ఇంత అని చెప్పి వసూల్ చేస్తున్న దళారీ వ్యవస్థలను రూపుమాపవలసిన ప్రభుత్వ వ్యవస్థ పూర్తిగా సిండికేట్ కు ప్రత్యక్షంగాను,పరోక్షంగాను సహకరిస్తుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయంటూ మండి పడుతున్న ఆక్వా రంగం ప్రపంచంలోనే డాలర్ విలువ పెరగాలన్న పడిపోవాలన్న ఒకవైపు ఆక్వా రంగం మరోవైపు సాఫ్ట్వేర్ ఇలాంటి పరిస్థితుల్లో డాలర్ విలువ 93 రూపాయలు పెరిగితే ఏ సందర్భంలోనూ ఆక్వారంగాన్ని బలోపేతం చేయాలని గాని ఆక్వా రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి దిశా నిర్దేశం లేకుండా వ్యవహరిస్తున్న తరుణంలో ఆక్వా రంగంలో రైతులు ఒక్కసారిగా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయడానికి కంకణం కట్టుకున్నారు అందులో భాగంగా ఆదివారం 22వ తారీఖున వీరవాసరం తులసీ కన్వెన్షన్ హాల్లో జరగబోయే భారీ బహిరంగ ఆక్వా సభకు హాజరు కాబోతున్న వేలాది ఆక్వా రైతులు. ఉభయ గోదావరి జిల్లాలో 60,70 శాతం ఆక్వా చెరువులు ద్వారా ప్రభుత్వా నికి ఆదాయం కల్పిస్తుంటే అందులో భాగంగా ఈస్ట్ గోదావరి నుండి 25% ఆదాయాన్నిస్తున్న రైతులపై ఇంతటి దౌర్భాగ్య పరిస్థితి ప్రభుత్వం కల్పించడం ఏమిటో అర్థం కాని పరిస్థితుల్లో రైతులు మనోవేదన చెందుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రైతులను పూర్తిగా ఆదుకుని రైతులకు ఇవ్వాల్సిన ఒకవైపు పవర్ సబ్సిడీ మరోవైపు మేతలపై ట్యాక్స్ తగ్గించి సబ్సిడీ వ్యవస్థలో రైతులకు పూర్తి న్యాయం చేయాల్సిందిగా ప్రభుత్వానికి తెలిసేలా ఈచలో వీరవాసరం సభ విజయవంతం చేసేలాగా ఆక్వా రైతులంతా కంకణం కట్టు కుని హాజరుకావాలని విజయ వంతం చేయాలని త్సవటపల్లి నాగభూషణం పిలుపునిచ్చారు.





# అనకాపల్లిలో భారీ స్టీల్ ప్లాంట్‌కు భూమి పూజ

## - మంత్రి నారా లోకేష్ కృషి అభినందనీయం



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** అనకాపల్లి జిల్లాలో దేశంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి ఈ నెల 23న జరగనున్న భూమి పూజ కార్యక్రమాన్ని పురస్కరించుకుని కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తి దంపతులు కార్యకర్తలతో కలిసి కరప, కాకినాడ రూరల్ మండలాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. పలు గ్రామాల్లో పర్యటించి కరపత్రాలు పంపిణీ చేసి కార్యక్రమ ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్సెలార్ మిట్టల్ - నిప్పాన్ స్టీల్ సంయుక్తంగా రూ.1.35 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో ఈ ప్రాజెక్టును స్థాపించడం రాష్ట్రానికి గర్వకారణమని తెలిపారు. తొలి దశలో రూ.80 వేల కోట్ల పెట్టుబడితో ప్రారంభమయ్యే ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 55 వేల ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వివరించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని, అనుబంధ పరిశ్రమలు పెరిగి యువతకు ఉపాధి అవకాశాలు విస్తరించనున్నాయని పేర్కొన్నారు. ఇంత భారీ పరిశ్రమను రాష్ట్రానికి తీసుకురావడంలో మంత్రి నారా లోకేష్ కీలక పాత్ర పోషించారని, పెట్టుబడులను ఆకర్షించడంలో ఆయన కృషి అభినందనీయమని అన్నారు. ఈ స్టీల్ ప్లాంట్ 2,200 ఎకరాల్లో ఏర్పడి, ప్రారంభ దశలో 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో పని చేసి, భవిష్యత్‌లో 17.8 మిలియన్ టన్నుల లక్ష్యాన్ని చేరుకోనుందని తెలిపారు. అదనంగా ఉత్తరాంధ్రలో గ్రీన్ హైడ్రోజన్, క్లీన్ టెక్ రంగాల్లో మరిన్ని పెట్టుబడులు రానున్నాయని వెల్లడించారు. మార్చి 23న సాయంత్రం 4 గంటలకు నక్కపల్లి మండలం బంగారయ్యపేటలో జరిగే భూమి పూజ కార్యక్రమానికి ప్రజలు భారీగా తరలి రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమం రాష్ట్ర అభివృద్ధికి దారితీసే చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు.

### పులి చంపిన మూడూ పశువులకు

# రూ.66,000 నష్టపరిహారం పంపిణీ



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజ్ పరిధిలో సంచరించిన రాయల్ బెంగాల్ టైగర్ చంపిన మూడు పెంపుడు మూగ జీవాల యజమానులకు నష్ట పరిహారాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అటవీశాఖ పంపిణీ చేసింది. పులి దాడిలో మొత్తం మూడు పెంపుడు జంతువులకూ కలపి మొత్తం రూ. 66,000 లను నష్ట పరిహారంగా ప్రభుత్వం డిమాండ్ డ్రాఫ్ట్ రూపంలో శుక్రవారం చెల్లించింది. ఈ పులి జిల్లాలో 10 రోజుల పాటు సంచరించి ఈ మార్చి 12 న తాడువాయి గ్రామంలో నెక్కంటి శ్రీనివాసరావు గేదె దూడను పులి దాడిచేసి చంపినందుకు ఈ బాదితునికి నష్ట పరిహారంగా రూ. 16,000 లు, 13 న అచ్చింపేట గ్రామంలో బొట్టా చినసత్యనారాయణ ఆవు దూడను పులి చంపినందుకు నష్టం పరిహారంగా రూ. 25,000 లు, 15 న మండపం గ్రామంలో పోలం తమ్మయ్య గేదె దూడను పులి చంపినందుకు కూడా నష్టం పరిహారంగా రూ. 25,000 లు చొప్పున విడివిడిగా డి.డి రూపంలో ప్రభుత్వం అందజేసింది. ఈ డిడిలను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చేతులు మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. పులి దాడిలో చనిపోయిన పశువులకు నష్టపరిహారాన్ని సకాలంలో మంజూరు చేయించడంలో అతి వేగంగా నష్ట పరిహారాన్ని పంపిణీ చేయడంలోనూ కాకినాడ జిల్లా అటవీ శాఖాధికారి ఎన్.రామచంద్రరావు చూపిన చొరవ శ్లాఘనీయం. ప్రస్తుతం పులి రాజవొమ్మంగి అటవీశాఖ రేంజ్ పరిధిలోనికి వెళ్ళిపోయిందని ఈ నష్టపరిహారాన్ని పంపిణీ సందర్భంగా అటవీశాఖ అధికారులు మీడియా ముఖంగా ప్రకటించారు. ఈ నష్టపరిహారం పంపిణీ కార్యక్రమంలో ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజ్ అధికారి దుర్గ రాంప్రసాద్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ జాన్సన్, శంఖవరం ఫారెస్ట్ సెక్షన్ అధికారి గంటిమళ్ళ నాగేశ్వరరావు, రౌతులపూడి ఫారెస్ట్ సెక్షన్ అధికారి పైడా శ్యాంకుమార్, కొత్తూరు అటవీ బీట్ ఆఫీసర్ పెయ్యల వెంకటరమణ, బవురువాక అటవీ బీట్ ఆఫీసర్ బుర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మహద్ చెరువు పోరాటానికి 99 ఏళ్లు

**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** 1927 మార్చి 20న మహద్ పట్టణంలోని చౌదర్ చెరువులో జరిగిన చారిత్రాత్మక సంఘటనకు నేటితో 99 ఏళ్లు పూర్తయ్యాయని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పిట్టా వరప్రసాద్ తెలిపారు. భారత సామాజిక చరిత్రలో ఇది అక్షరాలా స్వర్ణాక్షరాలతో లిఖించబడిన మహత్తర పోరాటమని పేర్కొన్నారు. అంటరానితనం అనే అమానుష వ్యవస్థ కారణంగా వేలాది దళితులకు త్రాగునీరు వంటి ప్రాథమిక హక్కులు కూడా నిరాకరించబడిన దారుణ పరిస్థితుల్లో, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నాయకత్వంలో జరిగిన మహద్ సత్యాగ్రహం సమానత్వం కోసం జరిగిన తొలి గొప్ప ఉద్యమాలలో ఒకటిగా నిలిచిందని ఆయన అన్నారు. చౌదర్ చెరువులోకి వేలాదిమంది దళితులతో కలిసి దిగిన బాబాసాహెబ్ అంబేద్కర్, "మనుషులందరికీ సమాన హక్కులు ఉండాలి" అనే మహత్తర సందేశాన్ని దేశానికి అందించారని తెలిపారు. ఈ పోరాటం కేవలం నీటి హక్కు కోసం మాత్రమే కాకుండా, మానవ గౌరవం, స్వాభిమానానికి ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. మహద్ సత్యాగ్రహం వంటి చారిత్రాత్మక పోరాటాలు నేటి తరానికి దారిదీపంలాంటివని, సమాజంలో ఇంకా కొనసాగుతున్న అసమానతలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టాలని డాక్టర్ పిట్టా వరప్రసాద్ పిలుపునిచ్చారు. సమానత్వం, సామాజిక న్యాయం సాధన కోసం అంబేద్కర్ చూపిన మార్గంలో నిరంతరం పోరాటం కొనసాగించడం తమ పార్టీ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మహద్ సత్యాగ్రహంలో పాల్గొన్న అమరవీరులకు ఘన నివాళులు అర్పిస్తూ, వారి త్యాగాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.

# కిడ్నీ బాధితురాలికి ఆర్థిక సాయం అందించిన గుంటూరి సోమరాజు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా పిఠాపురం రెండో వార్డ్ కు చెందిన శ్రీమతి అలుగోలు సుధా (38) వీరికి ఇద్దరు కుమారులు భర్త సత్యనారాయణ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నరు భార్య సుధాకు రెండు కిడ్నీలు పోవడంతో ఆర్థిక ఇబ్బందులతో ఉన్న వీరికి పి వెంకటాపురం గ్రామానికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు వాళ్ల పరిస్థితిని చూసి మంచి మనసుతో మానవ దృక్పథంతో గుంటూరి సోమరాజు వైద్య నిమిత్తము 20 వేల రూపాయలు చెక్కుని తన నివాసంలో కుటుంబ సభ్యులను పిలిచి మాజీ సర్పంచ్ లు అనుసూరి తాతబ్బాయి, బావిశెట్టి శ్రీను, ప్రముఖ వ్యాపారవేత్త ఎస్వీఎస్ రాజు సమక్షంలో అందించడం జరిగింది. ఈ సందర్భంగా గుంటూరి సోమరాజు మాట్లాడుతూ ఆర్థిక సాయం కోసం వచ్చిన వారికి నా వంతు 20వేల రూపాయల చెక్కుని ఇవ్వడం జరిగిందని అన్నారు. అదేవిధంగా మాజీ సర్పంచ్ అనసూయ తాతబ్బాయి నేను కలిసి ఎన్నో కార్యక్రమాలు చేశామని మరెన్నో కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నియోజకవర్గం లో ఉంటున్న వారికి ఆర్థిక సాయం అందేలా పవన్ కళ్యాణ్ వరకు తెలియపరిచే విధంగా ముందుకు వెళ్లాలన్నారు. అనంతరం ఎస్వీఎస్ రాజు మాట్లాడుతూ సోమరాజు ఎంతోమందికి ఆర్థిక సాయం అందించారని తలుపు తట్టి అడిగితే కాదనిని మంచి మనిషి సోమరాజు అన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందజేసి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బాలు, రాంబాబు, పెంకె కృష్ణారావు, విత్తనాలు సత్తిబాబు,గణేష్, ముత్తారావు, బావ శెట్టి సత్తిబాబు, పి వెంకటాపురం, పండూరు గ్రామస్తులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### ప్రజా సమస్యలపరిష్కారానికి

# ప్రజా దర్బార్ కార్యక్రమం కీలకం

## కాకినాడ రూరల్ కో-ఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబీ)




**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. మంత్రివర్యులు నారా లోకేష్ బాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఆదేశాల మేరకు ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం అందించాలనే లక్ష్యంతో ప్రతి వారం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు ఇల్లు పట్టాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, వృద్ధాప్య పింఛన్లు, దివ్యాంగుల పింఛన్లు, దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, సీఎంఆర్ఎఫ్, చంద్రన్న బీమా తదితర సమస్యలపై మొత్తం 24 అర్జీలు సమర్పించినట్లు వెల్లడించారు. అందిన ప్రతి అర్జీపై తక్షణమే స్పందించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్ట ప్రకాష్ గౌడ్, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లబత్తుల అప్పారావు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, కౌజు నెహ్రూ, తెలుగుదేశం పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాజీ మహిళా అధ్యక్షురాలు ఏటుకూరి నాగమణి,చెల్లిబోయిన సూర్యప్రకాశాలు, గుడాల లోవరాజు, మందరపు చిట్టిబాబు, జనసేన వీర మహిళ ముమ్మిడి పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

# డొక్కా సీతమ్మ సేవాసమితి ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పట్టణంలో బాలాజీ చౌక్ సెంటర్లో డొక్కా సీతమ్మ సేవాసమితి సభ్యుల ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డొక్కా సీతమ్మ సేవాసమితి సభ్యులు మీడియాతో మాట్లాడుతూ ముందుగా అందరికీ పరాభావ నామ సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేశారు. గత రెండు సంవత్సరాల నుంచి ఉగాది పచ్చడిని పుర ప్రజలకు పంపిణీ చేయడం జరుగుతుందని, పట్టణ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయబాబు, సిహెచ్సి చైర్మన్ వాగు రాజేష్, మెల్లిపాక నాగేంద్ర, సిరి ఫుడ్ కృష్ణ, కుర్రగోవిందు, పబ్లిక్ స్కూల్ సత్యనారాయణ, నడికట్ల వెంకన్న, తిరగటి సత్యనారాయణ, పంపన సూరిబాబు, స్కూల్ చైర్మన్ శ్రీను,డొక్కా సీతమ్మ సేవాసమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### మెగా జాబ్ క్యాలెండర్‌తో

# నిరుద్యోగులకు నూతన ఆశలు

## లోకేష్ హామీల అమలు నిదర్శనం : కటకంశెట్టి బాబి



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం విడుదల చేసిన 10,060 పోస్టుల మెగా జాబ్ క్యాలెండర్‌ను ప్రజలకు చేరవేసేందుకు కాకినాడ రూరల్ మండలం 47 వార్డు లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కో కోఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబి) కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి యువతకు ఈ అవకాశాలపై అవగాహన కల్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఏళ్ల తరబడి నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు ఇది నిజమైన కొత్త సంవత్సర పండుగ వంటిదని పేర్కొన్నారు. 10,060 పోస్టుల భర్తీ ద్వారా నిరుద్యోగుల చిరకాల స్వప్నాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నెరవేర్చారని తెలిపారు. యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ యువతకు ఇచ్చిన ప్రతి హామీని అక్షరాలా అమలు చేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. యువత సంక్షేమం, ఉపాధి కల్పనపై ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి ఈ మెగా జాబ్ క్యాలెండర్ నిదర్శనమని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా యువత ఇప్పటి నుంచే కష్టపడి చదవాలని, ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ కలలను సాకారం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. భారీ సంఖ్యలో పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టినందుకు కాకినాడ రూరల్ నియోజకవర్గం తెలుగు యువత తరుపున విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్ట ప్రకాష్ గౌడ్, మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి కౌజు నెహ్రూ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మాజీ మహిళా అధ్యక్షురాలు ఏటుకూరి నాగమణి, చెల్లిబోయిన సూర్యప్రకాశ్, గుడాల లోవరాజు, మందరపు చిట్టిబాబు, పొదరపు ఉమా తదితరులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన

# జనసేన నాయకులు మాదారపు తాతాజీ



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** గత 14 సంవత్సరాలుగా వేసవి లో మూడు నెలలు పాటు మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్న మీనాక్షి రాంబాబు దంపతుల సేవలు అభినందనీయమని తిమ్మాపురం గ్రామ జనసేన పార్టీ గౌరవ అధ్యక్షులు మాదారపు తాతాజీ పేర్కొన్నారు. శుక్రవారం తిమ్మాపురం జనసేన పార్టీ కార్యాలయం ఎదురుగా శ్రీ షిరిడి సాయి మందిర్ వద్ద శ్రీ సద్గురు సాయి బాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షులు రాంబాబు మీనాక్షి దంపతులు ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని తాతాజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా గురువర్యులు మామిడిపల్లి రామారావు లక్ష్మీ దంపతుల ఆశీస్సులతో గత 14 సంవత్సరాలుగా వేసవికాలంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మా వంతు కృషిగా మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. తిమ్మాపురం గ్రామం లో గత రెండు సంవత్సరాలుగా చలివేంద్రంలో ఏర్పాటు చేశామని అన్నారు. అలాగే అందుల పాఠశాలలలో ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఫ్రూట్ సలాడ్, కేకులు, డ్రింక్స్, పుస్తకాలు పెన్నులు అవసరమైన వారికి దుస్తులు పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తిమ్మాపురం పోలీస్ లు రమేష్మరియు తాతాజీ ట్రస్ట్ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

### జామియా మసీదు ముస్లింలకు

# ఎమ్మెల్యే సత్య ప్రభ ఇఫ్తార్ విందు



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలేశ్వరం పట్టణంలో జామియా మసీదు ముస్లిం సోదరులకు ప్రతిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు వరుపుల సత్యప్రభ బుధవారం రాత్రి ఇఫ్తార్ విందుని ఏర్పాటు చేశారు. ముందుగా మసీదు పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ ముస్లిం సోదరులకు రంజాన్ మాసం ప్రత్యేకత ఉందని నెల రోజులు ఉపవాసాలు చేసి భక్తిశ్రద్ధలతో అల్లాకు ప్రార్థన చేయడం జరుగుతుందని అన్నారు. ముస్లింసోదరులంతా ఇప్పుడు ఐకమత్యంగా ఉండాలన్నారు. అలాగే ముస్లిం సోదరుల వివాహ శుభకార్యముల కొరకు త్వరలో స్థలం కేటాయించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి, అలమండ చలమయ్య, బొదిరెడ్డిగోపి, మూదినారాయణస్వామి, కోరాడ కృష్ణ, సామంతుల గోపి, గొల్లపూడి త్రిమూర్తులు, వాగు రాజేష్, అంతరపు రాజు, అనంతపల్లి శ్రీను, పసుపులేటి శ్రీను, కూటమి శ్రేణులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

### దోమల లార్వాను ప్రజలు గుర్తించేలా చేసి

# డెంగీ, మలేరియాను అరికట్టాలి



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతీ గ్రామంలోనూ దోమల లార్వాను ప్రజలు అందరూ గుర్తించేలా క్షేత్ర స్థాయిలో ఏఎన్ఎం, ఎం.ఎల్.హెచ్.పి, సి.హెచ్.ఓ, ఆశ కార్యకర్తలు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని కాకినాడ జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఐ.ప్రభాకర్రావు ఆదేశించారు. ఈ సదవగాహన వలన డెంగీ, మలేరియా వ్యాధులు రాకుండా ముందుగానే అరికట్ట వచ్చని ఆయన చెప్పారు. జిల్లాలోని అన్ని సచివాలయాల్లోనూ ప్రతి శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది నిర్వహించే ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. 2025 సంవత్సరంలో జిల్లా మొత్తం మీద కత్తిపూడిలో ఎక్కువగ డెంగీ కేసులు నమోదు అయిన కారణంగా కత్తిపూడి పారిశుధ్యంపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారించారు. పంచాయతీలోని మూడు సచివాలయాల పరిధిలోని రెండు ఉప ఆరోగ్య కేంద్రాలను ఆయన సందర్శించారు. అనంతరం గ్రామంలోని ఫ్రైడే-డ్రైడే పారిశుద్ధ్య కార్యక్రమాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు ఇచ్చారు. గ్రామంలోని మూడు సచివాలయాల పరిధిలోని అన్ని గృహాలనూ ఏఎన్ఎం, ఎం.ఎల్.హెచ్.పి, సి.హెచ్.ఓ, ఆశ కార్యకర్తలు విధిగా సందర్శించాలని, అలా సందర్శించి నప్పుడే ప్రతీ ఇంటి లోపల, బయట ఉన్న పాత్రలు, గృహాల్లోని ఫ్రిజ్ లు వెనుక ఉన్న భాగాల్లోనూ, వాడి పారేసిన కొబ్బరి బొండాలు, టైర్లు, పాడైన, పనిచేయని వస్తువులు, గుంతల్లోనూ ఒక వారానికి మించి ఉన్న నీటి నిల్వలను విధిగా గుర్తించి ఆ నీటిని ఆయా గృహస్థుల సమక్షంలోనే వైద్య సిబ్బందే స్వయంగా తప్పని సరిగా తొలగించాలని, అలాగే పారిశుద్ధ్య సమస్యలను గుర్తించి పంచాయతీ సిబ్బంది సహకారంతో సరి చేయించాలని ప్రభాకర్రావు ఆదేశించారు. జ్వరంతో ఉన్న వారిని గుర్తించి వారి రక్తపూత నమూనాలు సేకరించి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబులకు పంపించాలి. జ్వరం తీవ్రత ఎక్కువగా ఉన్నట్లయితే వెంటనే వారిని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రిఫర్ చేసి చికిత్స చేయించాలని కాకినాడ జిల్లా మలేరియా అధికారి డాక్టర్ ఐ.ప్రభాకర్రావు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జిల్లా సూపర్వైజర్ పతంజలి, ఎం.పీ.ఎచ్.ఈ.ఓ. పి.వి.ఎస్. ప్రసాద్, హెల్త్ సూపర్వైజర్ తాతారావు, ఏఎన్ఎం. పప్పుల నాగమణి, ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

# సీఆర్‌డీఏ కమిషనర్‌గా విజయరామరాజు నియామకం

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీలో పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబును పౌరసరఫరాల శాఖ కమిషనర్‌గా నియమించింది. ఆయన స్థానంలో విజయరామరాజుకు బాధ్యతలు అప్పగించింది. మార్కాపురం కలెక్టర్‌గా విజయ సునీత, పోలవరం జిల్లా కలెక్టర్‌గా దినేశ్ కుమార్ నియమితులయ్యారు. పౌరసరఫరాలశాఖ కమిషనర్‌గా ఉన్న సౌరభ్ గౌర్‌ను రిలీవ్ చేసింది. రవి సుభాష్‌కు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది.

# 300 బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్స్‌పై నిషేధం

**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** అక్రమ బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్స్‌పై కేంద్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. 300 బెట్టింగ్ వెబ్‌సైట్లు, యాప్స్‌పై నిషేధం విధించింది. వీటిలో ఆన్‌లైన్ స్పోర్ట్స్ బెట్టింగ్ ప్లాట్‌ఫామ్స్, బెట్టింగ్ ఎక్స్ఛేంజీలు, సట్టా/మట్కా గ్యాంబ్లింగ్ నెట్‌వర్క్‌లు, రియల్‌మనీ కార్డ్-కెసినో గేమ్ యాప్స్ ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వం ఇప్పటివరకు సుమారు ఇలాంటి 8,400 వెబ్‌సైట్లు, యాప్స్‌ను నిషేధించింది. బెట్టింగ్, ఆన్‌లైన్ జూదం కారణంగా యువత పెడదోవ పట్టడం, ఆర్థికంగా చితికిపోతున్నట్లు గ్రహించిన కేంద్ర ప్రభుత్వం.. గతేడాది అక్టోబర్‌లో ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్, 2025ను తీసుకొచ్చింది. నగదుతో ముడిపడిన ఆన్‌లైన్ గేమింగ్‌ను నిషేధించింది. ఈ చట్టం అమల్లోకి వచ్చాక 4900 వెబ్‌సైట్లు/యాప్‌లపై చర్యలు చేపట్టింది.

# మద్దూరి అన్నపూర్ణయ్య జీవితం మార్గదర్శకం

## మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్‌కు అవార్డుతో సత్కారం - పలురంగాల ప్రముఖులకు అవార్డుల ప్రధానోత్సవం



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, ఆంధ్ర నేతాజీ శ్రీ మద్దూరి అన్నపూర్ణయ్య జీవితం మార్గదర్శకమని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. మద్దూరి అన్నపూర్ణయ్య 127వ జయంతిని పురస్కరించుకొని ఆయన పేరిట అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని శుక్రవారం ప్రకాశం నగర్ లోని ధర్మంచరకమ్యూనిటీ హాల్లో నిర్వహించారు.తొలిత జండా పంజా రోడ్డులో ఉన్న మద్దూరి అన్నపూర్ణయ్య పార్క్ లో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, మాజీ ఎమ్మెల్యే, వైసీపీ సీజీసీ సభ్యులు రౌతు సూర్యప్రకాశరావు, ఆర్యాపురం బ్యాంకు చైర్మన్ చల్లా శంకర్రావు, రాజమహేంద్రవరం పార్లమెంటు కాంగ్రెస్ ఇంచార్జ్ టీకే విశ్వేశ్వర్ రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు పొలసానపల్లి హనుమంతరావు, డాక్టర్ లంక సత్యనారాయణ, ఆర్ట్స్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు ముళ్ల మాధవ్ తదితరులు మద్దూరి అన్నపూర్ణయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ధర్మంచర కమ్యూనిటీ హాల్లో అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది.మద్దూరి అన్నపూర్ణయ స్మారక అవార్డును మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ కు,స్వతంత్ర సమరయోధులు అరవ ఆదినారాయణమూర్తి అవార్డును యోగ శిక్షకులు మన్యం శ్రీనివాస్ కు, ఉండవల్లి వెంకటసుబ్బారావు అవార్డును పొలసానపల్లి హనుమంతరావుకు, ఏసీవై రెడ్డి అవార్డును బుద్ధ శ్రీనివాస్ కు, చల్లా అప్పారావు అవార్డును డాక్టర్ పిల్లాడి పరమహంసకు, తులసి గంగాధర రామారావు అవార్డును అమీర్ పాషాకు, మద్దూరి అన్నపూర్ణయ్య పురస్కారాన్ని అడుసుమిల్లి వెంకట సూర్య సత్యనారాయణ బాబు చౌదరికి, మద్దూరి అన్నపూర్ణయ్య పురస్కారాన్ని అల్లు జయశ్రీకి అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర సమర పోరాటంలో మద్దూరి అన్నపూర్ణయ్య చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు.భార్యా పిల్లల్ని పోషించే బాధ్యతకూడా దేవుడిపై భారం వేసి,దేశం కోసం 55ఏళ్ళు దీక్షగా శ్రమించి,అందులో 11సంవత్సరాలు జైలులో గడిపిన మహా త్యాగి మద్దూరి అన్నపూర్ణయ్య అని కొనియాడారు.స్వాతంత్ర్య ఉద్యమకాలంలో అనేక అపూర్వ త్యాగాలు చేసి స్వతంత్రం రాగానే జాడ కనిపించకుండా పోయిన మహోన్నతనాయకులలో మద్దూరి కూడా ఒకరని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాషరావు మాట్లాడుతూ మద్దూరి అన్నపూర్ణయ్య జీవితం నేటి తరం తెలుసుకోవాలన్నారు బ్రిటిష్ వారిని ఎదిరించి ఎన్నో పోరాటాలు చేశారని పాత్రికేయుడిగా ఆయన రాసిన రచనలు విప్లవాన్ని సృష్టించాయని పేర్కొన్నారు. ఆయన పేరిట అవార్డును డొక్కా మాణిక్య వరప్రసాద్ కు అందజేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్,జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బోడా వెంకట్,యోగా శిక్షకులు పతంజలి శ్రీనివాస్, మాజీకార్పొరేటర్ వాకచర్ల కృష్ణ,సమితి ప్రధాన కార్యదర్శి బెజవాడ రంగారావు, సమితి ఉపాధ్యక్షులు కూరెళ్ళ హనుమంతరావు, న్యాయ సలహాదారులు కూనపరెడ్డి శ్రీనివాస్, సభ్యులు కోడూరి సుబ్రహ్మణ్యం, జాన్సన్ చాలిసరి, బిజెపి ఆచారి, రుక్మాందరావు,శ్రీపాద శ్రీనివాస్, పొలసానపల్లి రాధాకృష్ణ, పొలసానపల్లి భద్రరావు, నీలం గణపతి, పెదిరెడ్ల శ్రీనివాస్, అందనాపల్లి సత్యనారాయణ, వై వి ఉదయం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మావుళ్ళమ్మ అమ్మవారికి ఘనంగా సారె ఊరేగింపు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం గ్రామదేవత మావుళ్ళమ్మ అమ్మ వారికి గ్రామస్తులు ఘనంగా సారెను సమర్పించారు.ఉగాది పురస్కరించుకొని సుమారు 900 మంది మహిళలు 108 రకాల వంటకాలతో కూడిన సారెను అమ్మవారికి సమర్పించారు. గరగ నృత్యాల మధ్య గ్రామ పురవీధుల్లో శోభాయ మానంగా ఊరేగింపు నిర్వహించారు .ఈ యాత్ర లంకూరు, నాలుగు బొమ్మల సెంటర్, పాత పోలీస్ స్టేషన్ మీదుగా సాగి ఆలయానికి చేరుకుంది.ఆలయానికి చేరుకున్న అనంతరం భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

### ఘనంగా సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి

# పలివెల వీరబాబు జన్మదిన వేడుకలు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సిపిఐ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు పుట్టిన రోజు వేడుకలను పార్టీ కార్యాలయం నందు, సింగవరం,చిన్న కొండేపూడి,శ్రీరామనగరం వంటి పలు గ్రామాల్లో అభిమానులు పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. అభిమానుల,పార్టీ నాయకుల సమక్షంలో పలివెల కేకులను కట్ చేసి అభిమానులకు, ఆ పార్టీ నాయకులకు,కార్యకర్తలకు పంచారు. ఈ సందర్భంగా అభిమానులు పలువురు పేదవాళ్ళకి ఫ్రూట్స్,స్వీట్స్ పంచారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ పార్టీ నాయకుడు పలివెల వీరబాబు మాట్లాడుతూ ప్రజలు తనపై చూపించిన అభిమానానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు. తన పుట్టిన రోజున సేవా కార్యక్రమాలు నిర్వహించిన అభిమానులకు కృతజజతలు తెలిపారు. ఈ నేపథ్యంలోనే కార్ ట్రావెల్స్ యూనియన్ అధ్యక్షుడు గడగొట్టి ప్రశాంత్ కుమార్,సీతానగరం మండల ప్రెస్ క్లబ్ సభ్యులు,వంగలపూడి గ్రామ అంబేద్కర్ యూత్ పలివెల వీరబాబును శాలువాలతో,పూల గుచ్చాలతో ఘనంగా సన్మానించి పలివెలకు శుభాకాంక్షలు తెలిపారు. రాజానగరం నియోజకవర్గ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన పలివెలకు శుభాకాంక్షలు తెలపడానికి నియోజకవర్గ నలుమూలల నుండి భారీగా అభిమానులు,కార్యకర్తలు తరలివచ్చారు. రాజానగరం నియోజకవర్గ అభివృద్ధిలో ఆయన మరిన్ని మైలురాళ్లు అధిగమించాలని,భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని పలివెలను అభిమానులు ఆకాంక్షించారు. తమ ప్రియతమ నాయకుడు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని,పేద ప్రజలకు నిరంతరం చేయూతనిస్తూ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని అభిమానులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు సిపిఐ ఎంఎల్ పార్టీ నాయకులు కార్యకర్తలు,కూటమి నాయకులు,సీతానగరం మండల విలేకరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఆనందమే ఆరోగ్యం



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రోడ్‌లో గల ఆదిత్య బిజినెస్ స్కూల్లో వరల్డ్ డే ఆఫ్ హ్యాపీనెస్ దినోత్సవం బిబిఏ విద్యార్థులకు నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ డి.రామకృష్ణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిదులుగా ప్రముఖ సైకాలజిస్ట్ మిరియం సోని మరియు బ్రహ్మకుమారి మౌనిక విచ్చేశారు. ముఖ్య అతిథి విజయం సోని విద్యార్థులకు ఆనందం ప్రతి ఒక్కరి జీవితంలోనూ అవసరమని, అది కేవలం సంపాదించడంలోనూ లేదా విలాసవంతమైన జీవన విధానాన్ని కొనసాగించడంలోని ఉండదని, ఇది మన యొక్క ప్రవర్తన మరియు ఎదుటి వారికి సాయం చేయడంలో మరింత ఆనందం పొందవచ్చునని సామాజిక ఆనందంతో అందరూ ఆరోగ్యదాయకం గా ఉండగలరని దీనికి మంచి ఆలోచన మరియు మంచి నడవడిక అలవాటు చేసుకుంటేనే జీవితం మరింత ఆనందకరంగా మారుతుందని అన్నారు. ప్రతి మనిషి ఏదో ఒక దశలో ఆనందంకి దూరం అవుతారని అది కేవలం తాత్కాలికం మాత్రమే దానిని మంచి ఆలోచన మరియు మంచి దిశలో మనం అపజయాలను కూడా జయించడం వల్ల మరింత ఆనందం కలుగుతుందని అన్నారు. బ్రహ్మకుమారి మౌనిక మాట్లాడుతూ ప్రతి వ్యక్తి యాంత్రిక జీవితంలో గడుపుతున్నారని ప్రతి ఒక్కరికి మెడిటేషన్ మరియు యోగ అవసరమని తద్వారా శరీరాన్ని మరియు మనసుని మరింత ఆనందకరంగా మార్చుకుని అవకాశం ఉంటుందని ప్రతినిత్యం దీనిని పాటించాలని అలాగే సహృదయము కలిగి ఉండాలని అప్పుడే ఆనందం మరింత చేరువవుతుందని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీ ఆర్ వి సుబ్బారావు , కార్యక్రమ కోఆర్డినేటర్ పి శాంతి ప్రియ మరియు విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కళాశాల చైర్మన్ డాక్టర్ ఎన్ శేషారెడ్డి, సెక్రటరీ డాక్టర్ సుగుణ రెడ్డి మరియు డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు విద్యార్థులు నిరంతర శ్రమతో వారి జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకుంటారని అలాగే మంచి అలవాట్లతో మరింత ఆరోగ్యంతో పాటు ఆనందంగానే జీవనం సాగించవచ్చునని అన్నారు.

# డివిఎఫ్ జిల్లా అధ్యక్షుడుగా ముసుకూడి రాము నియామకం



**భీమవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** శుక్రవారం ఉదయం భీమవరం పట్టణం టౌన్ రైల్వే స్టేషన్ దగ్గర గల చక్కా వారి వీధిలోని దళిత వర్గాల ఫెడరేషన్ డివిఎఫ్ కార్యాలయం నందు జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహిం చడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు చెట్టే రాజు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దళిత వర్గాల ఫెడరేషన్ పశ్చిమ గోదావరి జిల్లా నూతన అధ్యక్షులుగా ఉండి నియోజకవర్గం కాళ్ల మండలం జక్కరం గ్రామానికి చెందిన ముసుకూడి రామును జిల్లా అధ్య క్షులుగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్య క్షులు చెట్టే రాజు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులు ఓటు చైతన్యం కలిగి దళిత రాజ్యా ధికారం వైపు ఆలోచన చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెరిగిన దళిత జనాభాను పరిగణలోకి తీసుకుని ఎస్సీలకు 18శాతం రిజర్వేషన్ కోటా కల్పించాలని కోరారు. నూతన అధ్యక్షుడుగా నియమితులైన ముసుకూడి రాముని నాయకులు కార్యకర్తలు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా దళిత నాయకులు మెరిపే రాజేష్, కనపాల మేరి, ఉప్పాటి సత్యం క్యానంవాణి,నారికమిల్లి రమేష్ తెన్నేటి రవి, చింతాడ రమేష్ మాదాసి ఏసు, ఆకుమర్తి నాని ముసుకుడి సంసోను తదితరులు పాల్గొన్నారు.

### మార్చి 23న డిల్లీ జంతర్మంతర్ వద్ద

# ధర్నాను విజయవంతం చేయండి



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** స్థానిక శేషయ్యమెట్ట వద్ద బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో హలో బి.సి ఛలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసిన శంకర్రావు తలపెట్టిన ఈ నెల 23వ తారీఖున ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద మహా ధర్నాను జయప్రదం చేయాలని పలువురు జిల్లా నాయకులు కోరారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు ముచ్చకర్ల సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జనగణన ఫార్మేట్ లోని సుదీర్ఘ 33 అంశాల ప్రశ్నావళిలో 12వ కాలంగా ఎస్సీ,ఎస్టీ ఇతర వర్గం అని మాత్రమే ఉన్నాయని తప్పనిసరిగా వాటితో పాటు ఓబిసి వర్గ కాలం చేర్చి ఓబీసీలకు సామాజిక న్యాయాన్ని చేకూర్చాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజమండ్రి అర్బన్,రూరల్ సంఘం అధ్యక్షులు బిల్డర్ చిన్న మాట్లాడుతూ దశాబ్దాలుగా జాతీయ స్థాయిలో ఓబీసీ సంఘాల పోరాటాల విజయంగా ఈసారి జరిపే జనగణనతో పాటే సమగ్ర కులగణన జరిపేందుకు కేంద్ర మంత్రి మండలి ఆమోదించడం ఓబీసీ సమాజం అరసిస్తుందన్నారు కానీ ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జనగణన ఫార్మేట్ లో ఓబీసీ కాలం లేకపోవడం విచారకరమన్నారు, జనగణన ఫార్మేట్ లో ఓబీసీ కాలం లేకపోతే వివిధ ఓబీసీ కులాలు విడివిడి జనాభాగాన్ని మొత్తం ఓబీసీలు జనాభా గాని తెలియదన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు దొమ్మేటి సోమశంకర్ రావు మాట్లాడుతూ వివిధ కులాల ఓబీసీల జనాభా తెలియకుండా వివిధ పథకాలు ద్వారా రాయితీలు రిజర్వేషన్లు ప్రభుత్వాలు ఎలా నిర్ధారించి అమలు చేయగలుగుతారని కేంద్రాన్ని ప్రశ్నించారు, అందుకే తప్పనిసరిగా ఓబీసీ కాలం జనగణన ఫార్మిట్లు ఉండాలని ఓబీసీ సంఘాలన్నీ ముక్తకంఠంతో ఘోషిస్తాయన్నారు ఈ నేపథ్యంలో సంఘం ఉభయగోదావరి జిల్లాల కన్వీనర్ కడలి వీర వెంకట సత్యనారాయణ మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీన ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జాతీయ స్థాయి మహా ధర్నాను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అందుకు హలో బీసీ చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదం చేయాలని కోరుతూ ఈరోజు గోడపత్రికను అవిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో మార్గానీ వసంత కుమార్, బొక్కం సింహాచలం, మార్గానీ రాజేంద్రప్రసాద్, ఏ వి వి సత్యనారాయణ,విన్నకోట మోహన్, జి వల్లూరి వీర వెంకటరమణ, బొబ్బిలి బాలమురళీకృష్ణ, బి కన్నారావు, శ్యాం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

### స్వర్ణాంధ్ర ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో

# ఘనంగా పలివెల జన్మదిన వేడుకలు



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంలో స్వర్ణాంధ్ర ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి .ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో మీడియా మిత్రుల ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మీడియా సభ్యులు మాట్లాడుతూ పలివెల వీరబాబు నిత్యం ప్రజల కోసం పోరాడుతూ మీడియా సభ్యులను కూడా తన కుటుంబ సభ్యుల వలె వెన్నంటే ఉంటున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ మీడియా వారు చూపించిన అభిమానానికి కృతజ్ఞతలు తెలియజేశారు.


### భార్గవ గాయత్రి బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో

# ఉగాది పురస్కారాలు : అధ్యక్షులు పరస



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉగాది పురస్కరించుకుని పౌరోహిత్యం, అర్చకత్వం విభాగాలలోని ప్రముఖులకు వివిధ పురస్కారాలు అందజేసినట్లు శ్రీ సీతారామ భార్గవ గాయత్రి బ్రాహ్మణ సేవాసమితి అధ్యక్షులు పరస శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం స్థానిక హరేరామ మందిరంలో బ్రహ్మశ్రీ కపిలవాయి నమశ్శివాయ శర్మచే పంచాంగ శ్రవణం, ప్రముఖుల జ్యోతిష్యం, పాడిపంటలు తెలియజేసారు. మండలలో పౌరోహిత్యం,అర్చకత్వ, సంఘసేవ విభాగంలో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులకు పూలమాలవేసి సాల్వాల్తో ఘనంగా సత్కరిస్తూ, మెమెంటోలు అందజేశారు. సంఘ అభివృద్ధికి తీసుకోవలసిన విషయాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు శ్రీ పెద్దింటి విద్యాసాగర్, కాశీభొట్ల నరసింహమూర్తి, భగవాన్ శర్మ,రవీంద్ర,గణపతి,కార్యవర్గ, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

# చిర్ల జగ్గిరెడ్డిని కలిసిన మాజీ చైర్ పర్సన్ రాణి



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసిపి అధ్యక్షులు,కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ను మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి గోపాలపురంలోని ఆయన స్వగృహంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె భర్త పతివాడ రమణ,ఓం జూయిలర్స్ అధినేతలు కొమ్ము రాంబాబు,కొమ్ము శ్రీను లతో కలిసి ఆయనకు దుస్సాలువాను కప్పి స్వీట్ బొకేను అందజేశారు.

### తెలికుల విశ్రాంత ఉద్యోగులకు

# ఉగాది సత్కారం



**రాజమహేద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** శ్రీ పరాభవ నామ ఉగాది వేడుకల్లో భాగంగా సిటీ గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలికుల విశ్రాంత ఉద్యోగులకు ఉగాది సత్కారం చేశారు.ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగులు మాట్లాడుతూ సిటీ గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం తమను ఈ విధంగా సత్కరించి ప్రోత్సహించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో సిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ముద్దుర్తి నాగేశ్వరరావు, కార్యదర్శి అంబటి గోపాలకృష్ణ, కోశాధికారి నరవ శ్రీనివాస్ ఇతర కార్యవర్గ సభ్యులు, కుల సంఘీయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పెళ్ళికి పిలవలేదని చిన్నారి అలక..

## ఇంటికి పిలిచి భోజనం పెట్టిన విరోష్ జంట..



టాలీవుడ్ సెన్సేషనల్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ఫిబ్రవరి 26న రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్‌లో సన్నిహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో వివాహం చేసుకున్నారు. అయితే 'విరోష్' పెళ్లి వేడుక ముగిసినా, దీనికి సంబంధించిన ఏదో ఒక వార్త సోషల్ మీడియాలో నిత్యం ట్రెండింగ్‌లో ఉంటూనే ఉంది స్టార్ హీరో విజయ్ దేవరకొండ, రష్మిక ఇటీవలే వివాహబంధంలోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26న రాజస్తాన్‌లోని ఉదయ్‌పూర్‌లో వీరి పెళ్లి వేడుక అత్యంత అట్టహాసంగా జరిగింది. ఇరు కుటుంబ సభ్యులు, స్నేహితులు, సన్నిహితులు, సినీ ప్రముఖుల ఈ పెళ్లి వేడుకకు హాజరయ్యారు. నూతన దంపతులను ఆశీర్వదించారు.ఇక ఈ గ్రాండ్ వెడ్డింగ్ తర్వాత కూడా బిజీ బిజీగా గడిపారు కొత్త దంపతులు. అలాగే విజయ్, రష్మిక టీమ్ దేశవ్యాప్తంగా పలు చోట్ల స్వీట్లు పంపిణీ , అదేవిధంగా దేవాలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు, అలాగే హైదరాబాద్ లో అభిమానులకు బంతి భోజనాలు ఏర్పాటు చేశారు. అలాగే రష్మిక, విజయ్ రిసెప్షన్ కూడా ఎంతో గ్రాండ్‌గా జరిగింది. అయితే విజయ్, రష్మిక పెళ్ళికి తనను ఎందుకు పిలవలేదు అంటూ ఓ చిన్నారి మొనీమధ్య చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం తెలిసిందే. ఆ చిన్నారి తన ముద్దు ముద్దు మాటలతో అడిగిన ప్రశ్నలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అయ్యాయి. విజయ్ దేవరకొండ-రష్మికలు పెళ్లి చేసుకున్నారు కదా.. మేం కూడా మీ ఫ్యాన్స్‌మే కదా.. మరి మమ్మల్ని పెళ్లికి ఎందుకు పిలవలేదు.? అందరికీ లడ్డూలు ఇస్తున్నారు, అన్నదానం చేస్తున్నారు.. మేం కూడా మీ కోసం సోషల్ మీడియాలో రీల్స్, వీడియోలు చేస్తున్నాం కదా.! మమ్మల్ని పిలిస్తే ఏమవుతుందంట.? ఈ వీడియో వారికి తెలిసేలా షేర్ చేయండి. అంటూ వీడియో చేసింది ఆ చిన్నారి. ఆ చిన్నారి వీడియో వైరల్ అవ్వడంతోపాటు అది విజయ్, రష్మిక వరకు చేరింది. దాంతో విరోష్ జంట ఆ పాపను కలిశారు. ఆ చిన్నారిని ఇంటికి పిలిచి స్వయంగా తమ చేతులతో ఆ చిన్నారికి వడ్డించారు విరోష్ జంట. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. భోజనం తర్వాత ఆ చిన్నారితో విజయ్, రష్మిక ముచ్చటించారు. ఆ చిన్నారి క్యూట్ మాటలకూ విజయ్, రష్మిక తెగ నవ్వుకున్నారు. ఈ వీడియోపై మీరూ ఓ లుక్కేయండి.



# తేజ సజ్జా టు కిరణ్ అబ్బవరం..

## రూటు మారుస్తోన్న టాలీవుడ్ కుర్ర హీరోలు

టాలీవుడ్ యువ హీరోలు ఇప్పుడు వెండితెరకే పరిమితం కాకుండా డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌పై కూడా తమ సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. ఒకప్పుడు కేవలం సినిమాలకే ప్రాధాన్యత ఇచ్చిన మన స్టార్లు, ఇప్పుడు ఓటీటీ కంటెంట్ వైపు ఆసక్తి చూపిస్తూ ప్రేక్షకులకు మరింత దగ్గరవుతున్నారు. 'హను-మాన్' సినిమాతో పాన్ ఇండియా రేంజ్‌లో భారీ క్రేజ్ తెచ్చుకున్న తేజ సజ్జా.. ఇప్పుడు ఓటీటీలో సరికొత్త అవతారంలో అలరించబోతున్నాడు. ఇంటర్నేషనల్ స్థాయిలో సూపర్ హిట్ అయిన 'ది ట్రేటర్స్' షో తెలుగు వర్షన్‌కి తేజ హోస్ట్‌గా వ్యవహరించనున్నాడు. ఒక మైండ్ గేమ్ ఆధారంగా నడిచే ఈ రియాలిటీ షోకి ఒక యంగ్ హీరో హోస్ట్‌గా వ్యవహరించడం టాలీవుడ్‌లో సరికొత్త ట్రెండ్. తన చురుకైన మాటలు, కాన్ఫిడెంట్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో షోని ప్రేక్షకుల్లోకి బలంగా తీసుకెళ్లగల సత్తా తేజకి ఉంది. ఈ ఓటీటీ ట్రెండ్‌కి పర్ఫెక్ట్ ఉదాహరణ అక్కినేని నాగ చైతన్య. ఆయన నటించిన 'దూత' వెబ్ సిరీస్ ఎంతటి సంచలనం సృష్టించిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు ఆ సూపర్ హిట్ సిరీస్‌కి సీక్వెల్‌గా 'దూత 2' రాబోతోంది. విక్రమ్ కె కుమార్ దర్శకత్వంలో తెరకెక్కనున్న ఈ సస్పెన్స్ థ్రిల్లర్ పైన అంచనాలు భారీగా ఉన్నాయి. తొలి భాగం ఇచ్చిన కిక్‌తో, రెండో భాగంలో చైతూ ఎలాంటి మిస్టరీలు ఛేదిస్తాడన్నది ఆసక్తికరంగా మారింది. ఈ ఓటీటీ రేసులో డిఫరెంట్ కాన్సెప్ట్‌లతో ముందుకు వస్తున్న మరో ఇద్దరు హీరోలు కిరణ్ అబ్బవరం, సుధీర్ బాబు. మాస్ ఆడియన్స్‌లో మంచి ఫాలోయింగ్ ఉన్న కిరణ్ అబ్బవరం.. 'గువ్వలచెరువు ఘాట్' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్‌తో డిజిటల్ ఎంట్రీ ఇస్తున్నాడు. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో ఒక ఇంటెన్స్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ ప్రాజెక్ట్ ఉండబోతుంది. మరోవైపు వైవిధ్యమైన పాత్రలు ఎంచుకునే సుధీర్ బాబు 'గల్లీ' అనే వెబ్ సిరీస్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. ఈ సిరీస్ లోకల్ పాలిటిక్స్ లేదా ఒక స్ట్రాంగ్ ఎమోషనల్ యాక్షన్ డ్రామాగా ఉండబోతుంది ఇది. జేడీ చక్రవర్తి సైతం ఇందులో కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ రెండు ప్రాజెక్టులు కూడా వాళ్ళ కెరీర్‌కి ఓటీటీలో మంచి బూస్ట్ ఇస్తాయని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఇక తనదైన స్టైల్ యాక్టింగ్‌తో ఎప్పుడూ ప్రయోగాలు చేసే యంగ్ హీరో సందీప్ కిషన్ కూడా డిజిటల్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేయడానికి సిద్ధమయ్యాడు. ఇప్పటికే ఓటీటీ కంటెంట్ పట్ల మంచి అవగాహన ఉన్న సందీప్.. ఈసారి 'సూపర్ సుబ్బు' అనే ఒక క్రేజీ ప్రాజెక్ట్‌తో రాబోతున్నాడు. టైటిల్ వింటుంటేనే ఇదొక ఫన్ అండ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా అనిపిస్తోంది. డిఫరెంట్ బాడీ లాంగ్వేజ్ మరియు కామిక్ టైమింగ్ ఉన్న సందీప్‌కి ఇలాంటి క్యాచీ క్యారెక్టర్స్ చాలా ఈజీగా సెట్ అయిపోతాయి. వెండితెరపై విభిన్నమైన సినిమాలు చేస్తూనే, ఓటీటీలో యువతను ఆకట్టుకోవడానికి సందీప్ వేసిన ఈ అడుగు కచ్చితంగా వర్కౌట్ అయ్యేలా కనిపిస్తోంది. వెబ్ సిరీస్‌లు, సినిమాలతో పాటే రియాలిటీ షోల వైపు కూడా మన యంగ్ హీరోలు దృష్టి పెడుతున్నారు. మొత్తంగా చూసుకుంటే టాలీవుడ్ యంగ్ జనరేషన్ హీరోలు గిరి గీసుకుని కూర్చోకుండా డిజిటల్ మార్పులను చాలా వేగంగా అడాప్ట్ చేసుకుంటున్నారు. ఒకవైపు థియేటర్లలో తమ సినిమాలతో ప్రేక్షకులను రంజింపజేస్తూనే, మరోవైపు ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ అందిస్తున్న స్వేచ్ఛను ఉపయోగించుకుని వినూత్న కథలతో ప్రయోగాలు చేస్తున్నారు. 'దూత 2' లాంటి థ్రిల్లర్ అయినా, 'గువ్వలచెరువు ఘాట్', 'గల్లీ' లాంటి ఇంటెన్స్ డ్రామాలైనా.. లేదా 'సూపర్ సుబ్బు' లాంటి ఎంటర్‌టైనర్, 'ది ట్రేటర్స్' లాంటి మైండ్ గేమ్ రియాలిటీ షో అయినా.. ఇవన్నీ ప్రేక్షకులకు సరికొత్త వినోదాన్ని పంచబోతున్నాయి. ముందు ముందు ఇంకెంతమంది హీరోలు ఈ ఓటీటీ బాట పడతారో వేచి చూడాలి!

# 2027 ప్రపంచకప్‌నకు టీమిండియా స్క్వాడ్..

క్రీడా వాయిస్

## 20 మందితో జాబితా రెడీ.. రోహిత్, కోహ్లీ పరిస్థితి ఏంటంటే?

2027 వన్డే వరల్డ్ కప్‌నకు ఇంకా ఏడాదిపైగానే సమయం ఉన్నప్పటికీ, బీసీసీఐ ముందుగానే జట్టు రూపకల్పనపై దృష్టి పెట్టింది. గత ఐసీసీ టోర్నీల్లో విజయాలు సాధించిన భారత జట్టు, ఈసారి కూడా ట్రోఫీపై కన్నేసింది. శుభ్‌మన్ గిల్ నాయకత్వంలో కొత్త దిశ.. ఇటీవల భారత వన్డే, టెస్ట్ జట్లకు శుభ్‌మన్ గిల్ నాయకత్వం వహిస్తున్నాడు. అయితే అతని కెప్టెన్సీలో జట్టు ప్రదర్శన మిశ్రమంగా ఉంది. ఆస్ట్రేలియా పర్యటనలో సిరీస్ కోల్పోవడం, స్వదేశంలో న్యూజిలాండ్ చేతిలో ఓటమి ఎదురవడం బీసీసీఐ ఆలోచనలను ప్రభావితం చేసింది.



**ఐపీఎల్ ప్రదర్శనపై ఎంపికలు..**

బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఐపీఎల్ 2026 మ్యాచ్‌లను జాగ్రత్తగా పరిశీలించనుంది. ప్రతి సెలెక్టర్ వారానికి కనీసం ఒక మ్యాచ్‌ను ప్రత్యక్షంగా లేదా టీవీ ద్వారా వీక్షిస్తూ ఆటగాళ్ల ఫామ్, ఫిట్‌నెస్‌ను అంచనా వేయనున్నారు. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని ఈ కమిటీ వరల్డ్ కప్‌నకు సరైన జట్టును ఎంపిక చేయడంలో కీలక పాత్ర పోషించనుంది.

**20 మంది ప్రాబబుల్స్ జాబితా..**

వరల్డ్ కప్ కోసం బీసీసీఐ సుమారు 20 మంది ఆటగాళ్ల జాబితాను సిద్ధం చేయాలని భావిస్తోంది. ఇందులో శుభ్‌మన్ గిల్, జస్ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, కేఎల్ రాహుల్ వంటి కీలక ఆటగాళ్లు ప్రధానంగా ఉంటారు. కొత్త ఆటగాళ్లను ఎక్కువగా ప్రయోగించకుండా, స్థిరమైన జట్టుతో ముందుకు వెళ్లాలనే ఆలోచన ఉంది.

**టెస్ట్ క్రికెట్‌పై స్పష్టమైన దృక్పథం..**

టెస్ట్ క్రికెట్‌లో ప్రయోగాలకు బీసీసీఐ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ వంటి బౌలర్లు ప్రధాన ఎంపికగా కొనసాగనున్నారు. ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగే టెస్ట్ మ్యాచ్‌లో కూడా వీరే కీలకంగా ఉండనున్నారు.

**రోహిత్-కోహ్లీ భవిష్యత్తు..**

టెస్ట్, టీ20లకు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ప్రస్తుతం వన్డేల్లో మాత్రమే ఆడుతున్నారు. ఇటీవలి సిరీస్‌ల్లో వీరి ప్రదర్శన స్థిరంగా ఉండటం గమనార్హం. అయితే ప్రతి మ్యాచ్ వీరి కెరీర్‌కు కీలకంగా మారుతోంది. వరల్డ్ కప్ జట్టులో వీరికి స్థానం దక్కుతుందా అన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది.

**తదుపరి సిరీస్..**

భారత జట్టు ఈ ఏడాది జూన్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో ఒక టెస్ట్, మూడు వన్డే మ్యాచ్‌లు ఆడనుంది. ఈ సిరీస్ కూడా వరల్డ్ కప్ జట్టు ఎంపికపై ప్రభావం చూపే అవకాశం ఉంది. బీసీసీఐ ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేస్తుండటం భారత జట్టు సీరియస్‌నెస్‌ను చూపిస్తోంది. అనుభవం, యువత కలయికతో 2027 వరల్డ్ కప్‌కు బలమైన జట్టు సిద్ధం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...

- భక్తి వాయిస్
- బిజినెస్ వాయిస్
- సినీ వాయిస్
- క్రైమ్ వాయిస్
- హెల్త్ వాయిస్
- కిసాన్ వాయిస్
- తీర్పు వాయిస్
- సక్సెస్ వాయిస్
- వనిత వాయిస్
- కిడ్స్ వాయిస్
- తీర్పు వాయిస్

# భారత క్రికెట్ హిస్టరీనే మార్చేసిన ఒకే ఒక్క మ్యాచ్..

## 25 ఏళ్ల వీడియో చూస్తే గూస్ బంప్స్ పక్కా..!

భారత క్రికెట్ చరిత్రలో 2001 కోల్‌కతా టెస్ట్ ఒక అద్భుతం. ఫాలో-ఆన్ ఆడుతూ, ఆస్ట్రేలియా వంటి దిగ్గజ జట్టును ఓడించి భారత్ సృష్టించిన చరిత్ర సామాన్యమైనది కాదు. వీవీఎస్ లక్ష్మణ్ 281 పరుగుల వీరోచిత పోరాటం, రాహుల్ ద్రావిడ్ అండ, హర్భజన్ హ్యాట్రిక్.. ఇలా ఎన్నో మరుపురాని ఘట్టాల సమాహారమే ఈ 'లక్ష్మణ్ టెస్ట్'. ఆ విశేషాలు ఓసారి చూద్దాం..! భారత క్రికెట్‌ను 1983 వరల్డ్ కప్ విజయం ఒక మలుపు తిప్పితే, 2001 కోల్‌కతా టెస్ట్ మ్యాచ్ టెస్ట్ క్రికెట్ పట్ల భారతీయుల దృక్పథాన్ని మార్చేసింది. అప్పటివరకు వరుసగా 16 టెస్ట్ విజయాలతో అప్రతిహతంగా సాగుతున్న స్టీవ్ వా నేతృత్వంలోని ఆస్ట్రేలియా జట్టును, ఈ మ్యాచ్‌లో భారత్ మట్టికరిపించింది. ఈ విజయం భారత ఆటగాళ్లలో 'మనం ఎవరినైనా ఓడించగలము' అనే అచంచలమైన ఆత్మవిశ్వాసాన్ని నింపింది. ఇది కేవలం ఒక మ్యాచ్ కాదు, నేటి భారత క్రికెట్ సూపర్ పవర్ స్థాయికి చేరడానికి పడిన బలమైన పునాదిగా నిలిచింది.వీవీఎస్ లక్ష్మణ్ - ది వెరీ వెరీ స్పెషల్ ఇన్నింగ్స్.. ఈ మ్యాచ్‌లో హైలైట్ అంటే వీవీఎస్ లక్ష్మణ్ ఆడిన 281 పరుగుల ఇన్నింగ్స్. అప్పటివరకు భారత్ తరపున టెస్టుల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు సునీల్ గవాస్కర్ (236) పేరిట ఉండేది. దానిని



చెరిపివేస్తూ లక్ష్మణ్ సృష్టించిన రికార్డు అద్భుతం. ముఖ్యంగా నాలుగో రోజు ఆట మొత్తం ఒక్క వికెట్ కూడా పడకుండా లక్ష్మణ్, రాహుల్ ద్రవిడ్ (180) కలిసి రోజంతా బ్యాటింగ్ చేయడం క్రికెట్ చరిత్రలోనే అరుదైన ఘట్టంగా నిలిచింది. షేన్ వార్న్ వంటి మేటి స్పిన్నర్లను లక్ష్మణ్ ఎదుర్కొన్న తీరు, గ్లెన్ మెక్‌గ్రా బౌలింగ్‌లో కొట్టిన స్ట్రోక్స్ ఇప్పటికీ అభిమానుల కళ్లముందే కదలాడుతుంటాయి.

**సమిష్టి కృషితో దక్కిన చారిత్రాత్మక విజయం..**

లక్ష్మణ్ ఇన్నింగ్స్ గురించి ఎంత చెప్పుకున్నా, ఇతర ఆటగాళ్ల కృషిని మరువలేం. హర్భజన్ సింగ్ సాధించిన టెస్ట్ హ్యాట్రిక్ భారత్ తరపున మొదటిది. అలాగే చివరి రోజు కీలక సమయంలో సచిన్ టెండూల్కర్ తీసిన మూడు వికెట్లు మ్యాచ్ ఫలితాన్ని భారత్ వైపు తిప్పాయి. సౌరవ్ గంగూలీ నాయకత్వంలో యువ రక్తం ఉరకలేసి, ఆస్ట్రేలియా 'ఫైనల్ ఫ్రాంటియర్' ఆశలను ఆవిరి చేసింది.

**నేటి తరానికి స్ఫూర్తి..**

పాతికేళ్లు గడిచినా, కోల్‌కతా టెస్ట్ జ్ఞాపకాలు గూస్‌బంప్స్ కలిగిస్తాయి. నేడు టెస్ట్ క్రికెట్‌లో సుదీర్ఘంగా బ్యాటింగ్ చేసే ఓపిక తగ్గిపోతున్న తరుణంలో, లక్ష్మణ్, ద్రవిడ్ ప్రదర్శించిన ఏకాగ్రత, పట్టుదల నేటి తరం క్రికెటర్లకు పాఠం లాంటిది. ఈ విజయం ఇచ్చిన టానిక్‌తోనే భారత్ తర్వాతి కాలంలో ప్రపంచ క్రికెట్‌ను శాసించే స్థాయికి చేరుకుంది.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com